ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -84 పేజీలు - 08 వెల - 04/- శనివారం 4 జనవరి 2025



# అల్లు అర్జున్ కు భారీ ఊరట...

రెగ్యులర్ బెయిల్ మంజూరు

సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో

బన్నీకి భారీ ఊరట

రూ. 50 వేల రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశం

2లో

# గత పదేళ్లలో పేదల కోసం 4 కోట్ల ఇళ్లు కట్టాం

నా కోసం నేనో ఇల్లు కట్టుకోలేదనే విషయం దేశానికి తెలుసు: ప్రధాని మోదీ

మేం అద్దాల మేడలో ఉండటం లేదన్న ప్రధాని

పదేళ్లుగా ఢిల్లీని ఓ విపత్తు చుట్టుకుందన్న ప్రధాని

బీజేపీలోనే అసలైన విపత్తు ఉందన్న కేజ్రీవాల్



న్యూఢిల్లీ,,జనవరి3ఆంధ్ర ప్రగతి :

తన కోసం ఇల్లు కట్టుకోలేదన్న విషయం దేశం మొత్తానికి తెలుసని, కానీ గత పదేళ్లలో పేదల కోసం 4 కోట్ల ఇళ్లు నిర్మించి వారి కలలను సాకారం చేశామని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఈరోజు ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్మించిన పలు నివాస సముదాయాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తాము నాలుగు కోట్ల మందికి ఇళ్లు కట్టించామని... కానీ తానేమీ అద్దాల మేడలో ఉండటం లేదన్నారు.మిగతాది 2లో...

# కర్ణాటకలో ఆర్టీసీ బస్సుల్లో ఏపీ మంత్రులు



2లో

- మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- ఎన్నికల వేళ హామీ ఇచ్చిన కూటమి
- మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసిన సీఎం
- అధ్యయనం నిమిత్తం కర్ణాటకలో ఏపీ మంత్రులు
- కర్ణటకలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం

# ఏఐ, డీప్ టెక్నాలజీని తెలుగువాళ్లు అందిపుచ్చుకోవాలి

నాలెడ్జ్ ఎకానమిలో

ఉన్నత స్థితికి ఎదగాలి

హెచ్ఐసీసీ వేదికగా ప్రపంచ తెలుగు సమాఖ్య వేడుకలు

జ్యోతి ప్రజ్వలన చేసి

ప్రారంభించిన చంద్రబాబు



హైదరాబాద్,జనవరి3ఆంధ్ర ప్రగతి : నాలెడ్జ్ ఎకానమిలో తెలుగువారు మరింత ఉన్నత స్థితికి ఎదగాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఏఐ, డీప్ టెక్నాలజీని తెలుగువాళ్లు అందిపుచ్చుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా ఏర్పాటు చేసిన ప్రపంచ తెలుగు సమాఖ్య 12వ ద్వైవార్షిక మహాసభలను చంద్రబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్టీఆర్ చేతుల మీదుగా తొలిసారి ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలు ప్రారంభమయ్యాయని గుర్తు చేశారు. 'అనంతపురం నుంచి ఆదిలాబాద్ వరకు..శ్రీకాకుళం నుంచి పాలమూరు వరకు ఎక్కడ ఉన్నా తెలుగువారంతా ఒక్కటే.. అదే తెలుగుజాతి. తెలంగాణ, ఏపీ, ఆస్ట్రేలియా, అమెరికా.. ప్రపంచ నలుమూలల నుంచి ఇక్కడకు వచ్చారు. వివిధ దేశాల సమాఖ్యల అధ్యక్షులు ఇక్కడకు వచ్చారు

మిగతా 2లో



# సజ్జల కుటుంబంపై భూ కబ్జా ఆరోపణలు...

- విచారణకు పవన్ ఆదేశం
- కడప శివార్లలో 52 ఎకరాల భూములు కబ్జా చేశారంటూ ఆరోపణలు
- పూర్తి స్థాయిలో నివేదిక ఇవ్వాలని పవన్ ఆదేశం
- పేదల, ప్రభుత్వ భూముల జోలికి వస్తే సహించేది లేదన్న పవన్

,జనవరి3ఆంధ్ర ప్రగతి :

వైసీపీ కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబంపై భూ కబ్జా ఆరోపణలు వచ్చాయి. కడప శివార్లలో 52 ఎకరాల చుక్కల భూములు, అటవీ భూములు, ప్రభుత్వ భూములను సజ్జల కుటుంబీకులు ఆక్రమించుకున్నారంటూ వచ్చిన ఆరోపణలు రాజకీయంగా కలకలం రేపుతున్నాయి. ఈ కబ్జా వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం సీరియస్ అయింది. భూ కబ్జా వ్యవహారంపై విచారణ జరపాలంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారు. సజ్జల కుటుంబం కబ్జాలపై పూర్తి నివేదిక ఇవ్వాలని అటవీ, రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. పేదల, ప్రభుత్వ భూముల జోలికి ఎవరు వచ్చినా సహించేది లేదని ఆయన హెచ్చరించారు. డిప్యూటీ సీఎం ఆదేశాలతో అధికారులు విచారణ నిమిత్తం రంగంలోకి దిగారు. ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు భూములను సర్వే చేస్తున్నారు. మరోవైపు, ఈ భూముల్లోనే సజ్జల గెస్ట్ హౌస్ కట్టుకున్నట్టు తెలుస్తోంది.

# బ్రిటన్ వెళ్లేందుకు అనుమతి కోరుతూ సీబీఐ కోర్టులో జగన్ పిటిషన్

ఈ నెల 11 నుంచి 15 వరకు జగన్ యూకే పర్యటన

కుటుంబ సమేతంగా వెళుతున్నామన్న వైసీపీ అధినేత

అనుమతి ఇవ్వాలంటూ సీబీఐ కోర్టులో పిటిషన్

కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐని ఆదేశించిన న్యాయస్థానం




2లో

# నేటి నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం...

ప్రారంభించనున్న నారా లోకేశ్

ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేసేందుకు మంత్రి నారా లోకేశ్ చర్యలు

డొక్కా సీతమ్మ పథకం పేరిట ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

విజయవాడలో లాంఛనంగా ప్రారంభించనున్న మంత్రి లోకేశ్

,జనవరి3ఆంధ్ర ప్రగతి :

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యను బలోపేతం చేసేందుకు విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నిర్మాణాత్మక చర్యలకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల హాజరుశాతం, ఫలితాల మెరుగుదలకు పలు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న 1,48,419 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం'మిగతాది 2లో...



# మెడికల్ సీట్లు ఖాళీగా ఉండడానికి వీల్లేదు

రాష్ట్రాలకు సుప్రీం కీలక ఆదేశాలు



న్యూఢిల్లీ,,జనవరి3ఆంధ్ర ప్రగతి :

వైద్య కళాశాలల్లో మెడికల్ సీట్లు ఖాళీగా ఉండటానికి వీల్లేదని ,మెడికల్ సీట్లకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలతో సహా ఇతర భాగస్వామ్య పక్షాలతో చర్చలు జరిపి చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించిందిమిగతాది 2లో...

# గత పదేళ్లలో పేదల కోసం 4 కోట్ల ఇళ్లు కట్టాం

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీ ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో ఆమ్ ఆద్మీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ ప్రభుత్వం లిక్కర్, స్కూల్, పొల్యూషన్ స్కాంలకు పాల్పడిందని విమర్శించారు. బహిరంగంగానే అవినీతికి పాల్పడుతున్నారన్నారు. గత పదేళ్లుగా ఢిల్లీని ఓ విపత్తు చుట్టుముట్టిందని ఆమ్ ఆద్మీ పార్టీని ఉద్దేశించి అన్నారు. ఇప్పుడు ప్రజలు ఆ విపత్తుకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధమయ్యారని వ్యాఖ్యానించారు.

**బీజేపీలోనే అసలైన విపత్తు: కేజ్రీవాల్:** అసలైన విపత్తు బీజేపీలోనే ఉందంటూ ప్రధాని మోదీకి మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కౌంటర్ ఇచ్చారు. ఢిల్లీలో విపత్తు లేదని, బీజేపీలోనే ఉందన్నారు. అసలు బీజేపీకి ఢిల్లీలో సీఎం అభ్యర్థి లేరని, ఆ పార్టీకి ఎలాంటి విజన్ లేదని, ఢిల్లీ ఎన్నికలకు సంబంధించి ఆ పార్టీకి అసలు అజెండానే లేదని కేజ్రీవాల్ మూడు పాయింట్లతో విమర్శలు గుప్పించారు. వేల కోట్లతో భవనం నిర్మించుకున్న వ్యక్తి... వేల కోట్లతో విమానంలో తిరిగే వ్యక్తి... లక్షల విలువ చేసే సూట్ ధరించే వ్యక్తి నుంచి అద్దాల మేడ ప్రస్తావన రావడం విడ్డూరంగా ఉందన్నారు.

# కర్ణాటకలో ఆర్టీసీ బస్సుల్లో ఏపీ మంత్రులు

ఏపీలో తాము అధికారంలోకి వస్తే మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే సౌకర్యం కల్పిస్తామని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఎన్నికల హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ హామీని నెరవేర్చేందుకు సీఎం చంద్రబాబు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, అధ్యయనం నిమిత్తం ఏపీ మంత్రివర్గ ఉపసంఘం కర్ణాటకలో పర్యాటిస్తోంది. మంత్రివర్గ ఉపసంఘం సభ్యులైన రాష్ట్ర రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఏపీ హోంమంత్రి అనిత, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి నేడు కర్ణాటక మంత్రి రామలింగారెడ్డిని, కర్ణాటక అధికారులను కలిశారు. వారితో సమావేశమై మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలుపై చర్చించారు. కర్ణాటకలో పర్యటన సందర్భంగా ఏపీ మంత్రులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. ఉచిత ప్రయాణంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే సమగ్ర నివేదికను సీఎం చంద్రబాబుకు సమర్పించనున్నారు.

# త్యాగధనుల పోరాట స్ఫూర్తిని మరువకూడదు

**నైతిక విలువలతో**
**యువత ముందుకు సాగాలి**
**రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ**
**మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపు**
**ముస్లిం స్వాతంత్ర సమరయోధుల**
**చిత్రాలతో క్యాలెండర్ ఆవిష్కరణ**




అమరావతి జనవరి 2 ఆంధ్ర ప్రగతి :

దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన ఎందరో మహనీయులు, త్యాగధనుల పోరాట స్ఫూర్తిని ప్రతి భారతీయుడు మరువరాదని రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు.మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నసీర్ అహ్మద్ సహకారంతో ముస్లిం స్వాతంత్ర సమరయోధుల చిత్రాలతో రూపొందించిన 2025 నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్ ను మంత్రి ఫరూక్ వెలగపూడి సచివాలయంలోని తన పేషీ లో శుక్రవారం ఆవిష్కరించారు. బ్రిటిష్ తెల్ల దొరల పాలనలో ఉన్న భారత్ ను, తెల్ల దొరల పాలన నుండి విముక్తి చేసేందుకు కుల మతాలకు అతీతంగా, జాతి మత తారతమ్య బేధాలను పక్కనపెట్టి ఎందరో మహనీయులు స్వాతంత్ర్య ఉద్యమాన్ని వివిధ రూపాల్లో చేయడం జరిగిందన్నారు. ఇందులో ముస్లిం స్వాతంత్ర సమరయోధులు చేసిన ప్రాణత్యాగాన్ని మంత్రి గుర్తు చేశారు. స్వాతంత్ర సమరంలో దేశం కోసం పోరాడి అమరులైన వారి ప్రాణ త్యాగాలను మరువరాదని అన్నారు.భావితరాలకు కూడా వారి పోరాట స్ఫూర్తిని తెలియజెప్పేందుకు స్వాతంత్ర ఉద్యమ మహనీయుల చిత్రాలను సందర్భం వచ్చినప్పుడల్లా ప్రజలకు తెలియజేసే చైతన్య కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందన్నారు. దేశం కోసం పోరాడి అమరులైన మహనీయులను ఆదర్శంగా తీసుకొని యువత నైతిక విలువలతో, క్రమశిక్షణతో, దేశం పట్ల అంకితభావంతో భారతదేశ పురోభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిన అవసరం,ఆవశ్యకత ఎంతైనా ఉందని మంత్రి ఫరూక్ అన్నారు. ముస్లిం స్వాతంత్ర సమరయోధుల చిత్రాలతో క్యాలెండర్ ను రూపొందించడం పట్ల మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీ ని మంత్రి ఫరూక్ అభినందించారు. ఈ కార్యక్రమంలో లీగల్ టీం అధ్యక్షులు సలీం పాషా, ఏం హెచ్ పి ఎస్ నాయకులు జాఫర్, షకీల్,అఫ్జల్, గౌరవ సలహాదారు ముఫ్తీ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు. ముస్లిం స్వాతంత్ర సమరయోధుల చిత్రాలతో ముద్రించిన క్యాలెండర్-2025 ప్రతులను 25 వేలకు పైగా దేశ వ్యాప్తంగా అందించనున్నారు.

# నాలెడ్జ్ ఎకానమీలో ఉన్నత స్థితికి ఎదగాలి

(మొదటి పేజీ తరువాయి)

. నా జీవితంలో ఇది ఎంతో సంతోషకరమైన రోజు. ప్రతి రెండేళ్లకు ఒకసారి ఈ ఉత్సవాలు నిర్వహించుకుంటున్నాం. తెలుగు భాష, సంప్రదాయాలు, సంస్కృతిపై ఇష్టం, గౌరవంతో ప్రపంచ నలుమూలల నుంచి ఈ కార్యక్రమానికి వచ్చారు. నిజం చెప్పాలంటే.. ఏపీ, తెలంగాణలో ఉండే తెలుగువారికంటే భాష, సంప్రదాయాలను కాపాడేది విదేశాల్లో ఉండే తెలుగువారేనని అన్నారు. 'ఏం చేయాలన్నా ఒక దూరదృష్టి ఉండాలి. ఒక నిర్దుష్టమైన ఆలోచన ఉండాలి. భవిష్యత్‌లో జరగబోయే విషయాలను మనం ముందుగానే ఆలోచించాలి. తగిన విధంగా ముందుకు వెళ్లగలిగితే ఏదైనా సాధ్యమే. దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రం తెలంగాణ. 25 సంవత్సరాల్లో ఇది సాధ్యమైంది. తెలుగువారు ఎక్కడున్నా రాణిస్తున్నారు. 1996లో ఐటీకి ప్రాధాన్యత ఇచ్చాను. ఐటీ తిండి పెడుతుందా అని అప్పట్లో ఎంతో మంది హేళన చేశారు. సెల్‌ఫోన్లు ప్రమోట్ చేస్తే.. ఏమన్నా ఉపయోగమా? అని ప్రశ్నించారు. కానీ ఈరోజు నాలెడ్జ్ ఎకానమీలో తెలుగువారు దూసుకెళ్తున్నారు. ఐటీలో రాణిస్తున్నవారు తెలుగు రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టాలి. ఆనాడు తెదేపా ప్రభుత్వం వేసిన పునాది కారణంగానే ఇక్కడ ఆదాయం పెరిగింది. చదువు, సంపద, జనాభాకు అవినాభావ సంబంధం ఉంటుంది. కొన్ని దేశాల్లో జనాభా రేటు తగ్గిపోతోంది. జపాన్, జర్మనీ దేశాలు భారతీయుల వైపు చూస్తున్నాయన్నారు. 'దేశ విదేశాల్లో తెలుగువారు గొప్పగా రాణిస్తున్నారు. తెలుగువారు ఎక్కడున్నా పరస్పరం సహకరించుకోవాలి. ఐక్యంగా ఉండి ఉన్నత స్థానాలకు ఎదగాలి. ఏ ఏ రంగాల్లో అవకాశాలు ఉన్నాయో తెలుగువారికి బాగా తెలుసు. విజన్ 2047తో ముందుకెళ్తున్నాం. 2047 నాటికి మనం ప్రపంచంలోనే మొదటి, రెండో స్థానంలో ఉంటాం. చిన్న ఆలోచనతో అనేక మంది తెలుగువారు కోటీశ్వరులు అయ్యారు. చిన్న ఆలోచనతో ర్యాపిడోను స్థాపించి గొప్పగా రాణించారు. కో-వర్కింగ్ స్పేస్ ద్వారా వేలమందికి ఉపాధి కల్పిస్తున్నారు. వినూత్నంగా ఆలోచిస్తే మరింత రాణిస్తారు. జీరో పావర్టీ మన లక్ష్యం కావాలి. 90 దేశాలకు కరోనా వ్యాక్సిన్ అందించిన ఘనత మనది. టాప్-10లో ఉన్న తెలుగు పారిశ్రామికవేత్తలు ఇతరులకు మెంటార్‌గా ఉండాలి. ఎక్కడున్నా.. ఎలా ఉన్నా.. పుట్టిన రాష్ట్రాన్ని మర్చిపోవద్దు. ఇప్పుడు చేయాల్సింది హార్డ్ వర్క్ కాదు.. స్మార్ట్ వర్క్. టెక్నాలజీని సరిగా వినియోగించుకుంటే ప్రపంచాన్ని జయించవచ్చు. తెలుగు వారికి గౌరవం తెచ్చిన నాయకుడు ఎన్టీఆర్. తెలుగు భాషకు గిడుగు రామ్మూర్తి ఎంతో సేవ చేశారు. తెలుగు భాష వికాసానికి రామోజీరావు ఎంతో కృషి చేశారు' అని చంద్రబాబు అన్నారు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని సంఘటిత పరిచి... తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, కళలు, సంప్రదాయ విలువలు, తెలుగు జాతి వారసత్వ సంపదను పరిపుష్టం చేస్తూ నేటితరం, భావితరాలకు అందించే లక్ష్యంతో సమావేశాలు, చర్చలు, సమాలోచనలు, కళా ప్రదర్శనలు నిర్వహించనున్నారు. వివిధ రంగాలకు చెందిన తెలుగు ప్రముఖులు, సినీ నటులు, విదేశాల్లో ఉన్న తెలుగు సంఘాల ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరయ్యారు. 5వ తేదీన జరిగే ముగింపు వేడుకలకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హాజరు అవుతారని సమాఖ్య అధ్యక్షురాలు ఇందిరాదత్ తెలిపారు. ప్రపంచ తెలుగు సమాఖ్యకు 1993లో శ్రీకారం చుట్టారు. తొలి మహాసభలు 1996లో హైదరాబాద్‌లో జరిగాయి. దాదాపు 30 ఏళ్లకు మళ్లీ ఇప్పుడు రెండోసారి నగరంలో నిర్వహిస్తున్నారు. రెండేళ్లకు ఒకసారి తెలుగు మహాసభలను విజయవంతంగా నిర్వహించారు. హైదరాబాద్‌తో పాటు విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, సింగపూర్, దుబాయ్, మలేసియాలలో మహాసభలు జరిగాయి.

# అల్లు అర్జున్ కు భారీ ఊరట...

## రెగ్యులర్ బెయిల్ మంజూరు

టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్ కు నాంపల్లి కోర్టు భారీ ఊరటను కల్పించింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో షరతులతో కూడిన రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. రూ. 50 వేల రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. రిమాండ్ ముగిసిన నేపథ్యంలో ఇటీవల జరిగిన కోర్టు విచారణకు అల్లు అర్జున్ వర్చువల్ గా హాజరయ్యారు. అదే రోజున రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన తరపు న్యాయవాదులు పిటిషన్ వేశారు. రెగ్యులర్ పిటిషన్ పై విచారణ జరిపిన కోర్టు ఈరోజు తీర్పును వెలువరించింది. బన్నీకి రెగ్యులర్ బెయిల్ మంజూరు కావడంతో ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.కాగా, బెయిల్ మంజూరు సందర్భంగా కోర్టు అల్లు అర్జున్ కు పలు షరతులు విధించింది. ప్రతి ఆదివారం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ లో హాజరుకావాలని ఆదేశించింది. ఈ కేసులో సాక్షులను ప్రభావితం చేయరాదని స్పష్టం చేసింది. ఈ మేరకు అల్లు అర్జున్ తరపు న్యాయవాది అశోక్ రెడ్డి వెల్లడించారు.

# నేటి నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం...

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేయాలని నిర్ణయించారు. (జనవరి 4) విజయవాడ పాయకాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మంత్రి లోకేశ్ లాంఛనంగా ప్రారంభిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు 398 పాఠశాలలు అనుసంధానమై ఉండగా, అక్కడ భోజనాలను తయారు చేస్తారు. మిగిలిన 77 కళాశాలలను కేంద్రీకృత వంటశాలలకు అనుసంధానించారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం అమలుకు ఈ ఏడాది రూ.27.39 కోట్లు, వచ్చే విద్యాసంవత్సరంలో రూ.85.84 కోట్లు ఖర్చుచేయనున్నారు.

# విమానాశ్రయాల విస్తరణపై దృష్టి

## అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి,జనవరి3(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న విమానాశ్రయాలతో పాటు కొత్తగా నిర్మిస్తున్న విమానాశ్రయాలను త్వరగా పూర్తి చేయాల్సి ఉందని సిఎం చంద్రబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎయిర్‌పోర్ట్‌ల విస్తరణపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష సమావేశం నిర్వహించారు.. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న విమానాశ్రయాలతో పాటు కొత్తగా నిర్మిస్తున్న విమానాశ్రయాలకు సంబంధించి ఈ సమావేశంలో చర్చ జరిగింది.. కుప్పం ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించి పరిస్థితిపై చంద్రబాబు నాయుడు.. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.. ఇక, అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటు జరుగుతోందన్నారు సీఎం చంద్రబాబు.. ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్ట్‌పై దృష్టి పెట్టాలని సూచించారు.. అనకాపల్లి, కాకినాడ, విశాఖపట్నంకు దగ్గరలో ఈ ఎయిర్‌పోర్ట్ ఉండే విధంగా ఏర్పాటు జరగాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. మరోవైపు.. రాష్ట్రంలో మెట్రో రైల్ ప్రాజెక్టులపై గురువారం రోజు సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించిన విషయం విదితమే.. ఏపీ పునర్విభజన చట్టంలో కూడా రాష్ట్రానికి మెట్రో ప్రాజెక్టు ఉందనే విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసిన సీఎం.. ఏపీ పునర్విభజన చట్ట ప్రకారం అయినా.. లేకపోతే 2017 మెట్రో పాలసీ ద్వారానైనా కేంద్ర ప్రభుత్వం ఈ మెట్రో రైలు ప్రాజెక్టులకు సాయం చేయాలని విషయాన్ని వెల్లడించారు.. విశాఖ, విజయవాడ లో చేపట్టే మెట్రో ప్రాజెక్టుల్లో డబుల్ డెక్కర్ విధానం అమలు చేయబోతున్నట్లు పేర్కొన్నారు సీఎం. విశాఖలో మొదటి దశలో చేపట్టే మధురవాడ నుంచి తాడిచెట్లపాలెం వరకు 15 కిలోమీటర్ల మార్గంలో.. గాజువాక నుంచి విశాఖ స్టీల్ ఎ÷-లాంట్ వరకు 4 కిలోమీటర్ల పాటు డబుల్ డెక్కర్ మోడల్‌లో మెట్రో రైలు నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు.. విజయవాడలో రామవరప్పాడు రింగ్ నుంచి నిడమానూరు వరకు 4.7 కిలోమీటర్ల డబుల్ డెక్కర్ విధానంలో మెట్రో నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు.

# జూన్ 15 లోపు తల్లికి వందనం పథకం అమలు : మంత్రి అచ్చెన్నాయుడు



ఏపీలో సూపర్ సిక్స్ పథకాలపై కూడా వైసీపీ రాద్ధాంతం చేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. కాకినాడ జిల్లా సామర్లకోటలో వేర్ హౌస్ కార్పొరేషన్ గోడౌన్ లను అచ్చెన్నాయుడు నేడు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇచ్చిన హామీల్లో ప్రతి ఒక్కటీ నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. జూన్ 15 లోగా తల్లికి వందనం పథకం అమలు చేస్తామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పులకు ఇప్పుడు కూటమి ప్రభుత్వం రూ.22 వేల కోట్ల వడ్డీ కడుతోందని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రం వెంటిలేటర్ పై ఉందని, కేంద్రం సహకారం అందించడం వల్ల రాష్ట్రానికి ఆక్సిజన్ అందించగలిగామని, తద్వారా రాష్ట్రం కుదుటపడుతోందని వివరించారు.

కనీసం ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి కూడా ఖజానాలో ఉన్న సంపద సరిపోవడం లేదని అచ్చెన్నాయుడు విచారం వ్యక్తం చేశారు. అయినప్పటికీ, వెనుకంజ వేయబోమని, అన్ని హామీలు నెరవేర్చిన తర్వాతే ఎన్నికలకు వెళతామని స్పష్టం చేశారు.

# మెడికల్ సీట్లు ఖాళీగా ఉండడానికి వీల్లేదు

## రాష్ట్రాలకు సుప్రీం కీలక ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

దీనిపై ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. వైద్య విద్యకు సంబంధించి సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో దాదాపు వెయ్యికి పైగా సీట్లు ఖాళీగా ఉండటంపై ఏప్రిల్ 2023లో సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఓ వైపు సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో వైద్యుల కొరత ఉండటం, మరోవైపు ఇలా సీట్లు మిగిలిపోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దీంతో చర్యలు చేపట్టిన కేంద్ర ప్రభుత్వం.. ఈ అంశంపై అధ్యయనం చేసేందుకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ అధ్యక్షతన అన్ని రాష్ట్రాలు, ప్రైవేటు మెడికల్ కాలేజీల ప్రతినిధులతో ఓ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ తాజాగా కొన్ని సిఫార్సులు చేయడంతో ఇదే విషయాన్ని సుప్రీం కోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది. ఈ అంశానికి సంబంధించిన పిటిషన్‌ను నేడు విచారించిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం.. మెడికల్ సీట్లు ఖాళీగా ఉండకూడదని స్పష్టం చేసింది. వివిధ భాగస్వామ్య పక్షాలతో సమావేశం ఏర్పాటు చేసి, ఆ తర్వాత ఓ కచ్చితమైన ప్రతిపాదనతో వస్తే బాగుంటుందని అభిప్రాయపడింది. ఈ మేరకు కేంద్రాన్ని ఆదేశించిన న్యాయస్థానం.. మూడు నెలల్లో పూర్తి చేయాలని పేర్కొంటూ తదుపరి విచారణ ఏప్రిల్‌లో చేపడతామని తెలిపింది.

# బ్రిటన్ వెళ్లేందుకు అనుమతి కోరుతూ సీబీఐ కోర్టులో జగన్ పిటిషన్

మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ విదేశీ పర్యటనకు వెళ్లేందుకు సీబీఐ కోర్టును అనుమతి కోరారు. జనవరి 11 నుంచి 15 వరకు యూకే పర్యటనకు అనుమతి ఇవ్వాలంటూ జగన్ నేడు సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జగన్ పిటిషన్ ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం... కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐని ఆదేశించింది. సీబీఐ కౌంటర్ తర్వాత వాదనలు వింటామని స్పష్టం చేసింది. కాగా, తాను కుటుంబ సమేతంగా లండన్ వెళ్లాలనుకుంటున్నట్టు జగన్ పిటిషన్ లో పేర్కొన్నారు. జగన్ కుమార్తెలు యూకేలో విద్యాభ్యాసం చేస్తుండడం తెలిసిందే. అక్రమాస్తుల కేసులో జగన్ బెయిల్ పై బయటున్నారు. అందువల్ల, ఆయన విదేశాలకు వెళ్లాలంటే కోర్టు అనుమతి తప్పనిసరి. గత కొన్నేళ్లుగా ఆయన కోర్టు అనుమతితోనే విదేశాలకు వెళుతున్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం 4 జనవరి 2025








# విద్యార్థులు సృజనాత్మకత కలిగి ఉండాలి..!

## -సాధించాలనే తపన ప్రతి విద్యార్థిలో ఉండాలి. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.



ఆంధ్ర ప్రగతి నంద్యాల, జనవరి 03: విద్యార్థులు చదువును విశ్లేషణాత్మకంగా, ప్రయోగాత్మకంగా తెలుసుకుని విద్యనభ్యసిస్తే ఉన్నత స్థితిలో రాణించగలుగుతారని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని ఎస్పిజి పాఠశాలలోని జిల్లాస్థాయి సదరన్ సైన్స్ ఫెర్ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డీఈఓ జనార్దన్ రెడ్డి, సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రేమంత కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలను కంఠస్థం చేసే రీతిలో కాకుండా విశ్లేషణాత్మకంగా, ప్రయోగాత్మకంగా తెలుసుకొని విద్యనభ్యసిస్తే ఉన్నత



స్థితికి చేరుకోవడమే కాకుండా నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటారన్నారు. పాఠశాలలో నిర్వహించే వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన, సైన్స్ ఫెయిర్ లాంటి పోటీ అంశాలలో విద్యార్థులందరూ భాగస్వాములై సృజనాత్మకతను పెంపొందించుకోవాలని విద్యార్థులకు కలెక్టర్ ఉద్బోధించారు. విద్యార్థులు విద్యనభ్యసిస్తున్న వార్షిక పాఠ్యాంశాలతో పాటు అదనపు కరికులాన్ని పెంపొందించుకుంటే పోటీ పరీక్షల్లో నెగుకొచ్చే సామర్థ్యం కలిగి ఉంటారన్నారు. విద్యార్థులు ఖాళీ



సమయాల్లో మొబైల్ ఫోన్లకు బానిస కాకుండా ఎల్లప్పుడూ మెదడుకు పని పెడుతూ మేధస్సును సంపత్తిని పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతికూల ఆలోచనలను పక్కనపెట్టి అనుకూల దృక్పధాన్ని అలవర్చుకొని తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరితో క్రమశిక్షణతో మెలగాలన్నారు. చదువుతోపాటు ఆటపాటలు, ఏదో ఒక లైఫ్ స్కిల్ కచ్చితంగా కలిగి ఉండాలన్నారు. తాను చిన్నప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో అన్ని పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్లే కలెక్టర్ స్థాయికి ఎదగలిగానని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇలాంటి సైన్స్ ఫెర్ లలో పాల్గొంటే భవిష్యత్తులో జరిగే పోటీ పరీక్షలకు మంచి పునాదిగా ఉంటుందన్నారు.



ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకొని విద్యార్థులు ప్రతి పోటీ అంశంలో పాల్గొనేందుకు ఉత్సాహం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి పనులు కల్పించడంలో నిర్లక్ష్యాన్ని విడనాడండి

## -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.

ఆంధ్ర ప్రగతి నంద్యాల, జనవరి 03: జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద వేతనదారులకు పనులు కల్పించడంలో నిర్లక్ష్యాన్ని విడనాడాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఏపిడి,ఏపీఓలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి హామీ లక్ష్యాల ప్రగతిపై సమీక్షించారు. ఈ సమావేశంలో డ్వామా పిడి జనార్దన్ రావు, పశు సంవర్ధక శాఖ అధికారి గోవింద నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఉపాధి హామీ కింద వేతనదారులకు పరులు కల్పించడంలో ఏపీడి, ఏపీవోలు




నిర్లక్ష్యం చేస్తున్నారని పనితీరు మెరుగుపరుచుకుని నిర్దేశించిన పనుల్లో లక్ష్యాన్ని సాధించడంలో ప్రత్యేక శ్రద్ధ కనపరచాలన్నారు. లేబర్ బడ్జెట్ కింద వేతన దారులకు వంద రోజులు పని దినాలు కల్పించడంలో పూర్తిగా వెనుకబడి ఉన్నారన్నారు. జిల్లాలో 2.3 లక్షల మంది వేతనదారులు ఉంటే కేవలం 3000 మందికి మాత్రమే వందరోజుల పని దినాలు కల్పించడం నిర్లక్ష్యానికి అద్దం పడుతుందన్నారు. జిల్లాలో 6.72 లక్షల హౌసింగ్ మ్యాన్డేస్ ఉన్నప్పటికీ పనులు కల్పించలేకపోయారని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అధ్వాన రీతిలో ప్రగతి చూపిన అధికారుల ఫైళ్ళను సర్క్యులేట్ చేయాలని డ్వామా పీడీని కలెక్టర్ ఆదేశించారు. పనులు కల్పించే అవకాశాలు ఉన్నచోట కూడా పనులు కల్పించడంలో అశ్రద్ధ చేస్తున్నారన్నారు. లేబర్ బడ్జెట్, సరాసరి దినసరి వేతన కూలీ, గోకులం షెడ్లు తదితర అంశాలలో దిగువ స్థానంలో ప్రగతి ఉండడంపై సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రశ్నిస్తూ నిర్దేశించిన పనులన్నింటినీ మార్చి 31 లోగా పూర్తిస్థాయిలో చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 03:సావిత్రీబాయి పూలే జయంతినీ పురస్కరించుకొని నేడు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు అనందకుమార్, నిరంజన్ మరియు నర్సులు మరియు బహుజన టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కె. సతీష్ కుమార్ కలిసి సావిత్రి భాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారని మెడికల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆనంద్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిరంజన్ మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే గారు చేసిన సేవలను కొనియాడుతూ అందరూ పూలే దంపతుల మాదిరిగా ప్రజలకు సేవలు చేసి మన్నలను పొందాలని సూచించారు. బిటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కె. సతీష్ కుమార్ మాట్లాడుతూ సావిత్రి భాయి పూలే దంపతులు చేసిన సేవలు ఎనలేనివని అటువంటి అవకాశం హాస్పిటల్ లో పనిచేసే ప్రతి సిబ్బందికి దొరకడం అదృష్టం అని పూలే దంపతుల వలే ప్రజలకు సేవ చేసి మన్నలను పొందాలని సూచించారు.

# మాల మహానాడు రాయలసీమ యుద్ధ గర్జన.

ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 03: మాల మహానాడు రాయలసీమ యుద్ధ గర్జన ఫిబ్రవరి 23వ తేదీన కర్నూల్ ఎస్టిబిసి కాలేజీ ఆవరణంలో జరుగుతున్న గర్జన సమావేశమునకు నంద్యాలలోని మాల జాతి యులందరూ సంఘటిత శక్తితో ఐక్యతను చాటి చెప్పడానికి సమావేశమును సమాయత్తము చేయటానికి రాష్ట్ర నాయకులు ఈటే ఓబులేష్, మేధావి వెంకటేశ్వర్లు, మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు ఒకరైన మాధవస్వామి, మాల మహానాడు రాష్ట్ర నాయకులు కడెయం, సాంబశివుడు బెల్లం రాజకుమార్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గుర్రము లక్ష్మీ రాష్ట్ర మహిళా కార్యదర్శి, కే రోజమ్మ దళిత మహాసేన మహిళ రాష్ట్ర అధ్యక్షులు , ప్రముఖ న్యాయవాదులు దండు పుల్లన్న, గొడుగు రవికుమార్, చింతలయ్య, చిన్న లింగమయ్య, చంద్రశేఖర్, రాజేంద్రప్రసాద్, వైసీ పుల్లయ్య, మరియు ఎం రాజశేఖర్ ,మేకల వెంకట్ , రామసుబ్బయ్య, ఇండ్ల వెంకటరమణ, ఈ శ్రీనివాసులు ప్రేమ్ కుమార్ అయ్యాస్వామి , కే సునీల్ పి ఏసేపు ఎం నాగన్న పి ఎల్లయ్య కే విశ్వనాథ్ మునిస్వామి సముద్రాల ప్రవీణ్ కుమారు సముద్రాల శోభారాణి మాల మహానాడు నాయకులు మాల మహానాడు నాయకురాల్లు తమదైన శైలిలో తమ దానిని వ్యక్తం చేయడం జరిగినది. మరి



ముఖ్యంగామాల మహానాడు గౌరవాధ్యక్షులు మేకల లింగస్వామి ఆధ్వర్యంలో సమావేశం జరిగినది ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మేక లింగస్వామి తనదైన శైలిలో మాట్లాడుతూ వర్గీకరణ అన్నది. రాజ్యాంగబద్ధంగా జరగవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని దీనికి విరుద్ధంగా ప్రభుత్వాలు వర్గీకరణ చేయడానికి సమాయత్తము కావడం మాలలు జీర్ణించుకోలేని అంశమని వర్గీకరణ రాజ్యాంగబద్ధంగా చేయవలసినటువంటి ప్రభుత్వాలే వర్గీకరణ అంశాన్ని తప్పుదోవ తో మభ్యపెడుతున్నావని కనుమరుగు చేస్తున్నాయని భారతదేశంలో రాజ్యాంగా బద్ధంగా చేయవలసిన వర్గీకరణను తప్పుదోవ పట్టిస్తున్నారని రాజ్యాంగానికి విలువ లేకుండా చేస్తున్నటువంటి నైజాన్ని మేధావులందరూ గమనిస్తూ చూస్తున్నరు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహెూన్నతమైనటువంటి ఆశయంతో ఆనాడు రిజర్వేషన్ ఫలాలు అంటరాని తనము ,అస్పృశత ఆధారంగ రూపొందించబడినదికానీ నేటి పాలకులు రాజ్యాంగం బద్ధమైనటువంటి ఆధారాన్ని రూపుమాపి రాజ్యాధికారానికి విరుద్ధంగా తమదైన శైలిలో వర్గీకరణ ఫ లాలను సరైన రీతిలో విభజించుట లేదని ఇది ప్రతి మేధావికి తెలిసిన రాజ్యాంగ సత్యం అని కానీ నేడు రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వాలు మాత్రమే ఒక వర్గానికి కొమ్ముకాస్తూ ఓటు బ్యాంకు రాజకీయం చేస్తున్నారని ఇది సరైన సిద్ధాంతము మార్గము కాదని ఇది కేవలం రెండు కులాల మధ్య ఈర్ష ద్వేషాలు రేకెత్తించడానికి ఒక మార్గముగా ఎంచుకున్నారని ఇప్పటికైనా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు తమ మూర?త్వాన్ని వీడి సరియైన సమానత్వ దృష్టితో రాజ్యాంగ పలాలు అందరికీ అందవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తమదైన భావోద్వేగంతో తెలిపారు.

ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు స్థానిక నాయకులు తమ అభిప్రాయాలను సమగ్రంగా సంయుక్తంగా వ్యక్తం చేయడం జరిగినది.

# వైకుంఠ ఏకాదశి మరియు రథోత్సవానికి

## ఎన్ఎండి ఫయాజ్ ని ఆహ్వానించిన రామాలయం కమిటీ సభ్యులు.




ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 03: నంద్యాల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ని మర్యాదపూర్వకంగా శ్రీ భగవత్ సేవా సమాజ్ (సంజీవనగర్ గేట్ కోదండ రామాలయం) కమిటీ సభ్యులు కలిసి ఈనెల10-01-2025 తేదీనుంచి 14-01-2025 వ తేదీ వరకు జరుగు వివిధ కార్యక్రమాలు (వైకుంఠ ఏకాదశి మరియు రథోత్సవానికి) కు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎన్ఎండి ఫయాజ్ ని ఆహ్వానించడం జరిగింది . ఈ కార్యక్రమంలో శ్రీ భగవత్ సేవా సమాజ్ (సంజీవ నగర్ గేట్ రామాలయం) సెక్రటరీ వంకదార మధు , ట్రెజరర్ మాగం గురు ప్రసాద్ , కమిటీ సభ్యులు జయప్రకాష్ ,వసంత రాఘవ ప్రభు తదితరులు పాల్గొన్నారు.



# మేరీనా బీచ్ లో గల్లంతైన సాయి సంతోష్ రెడ్డి మృతదేహం లభ్యం

### -ప్రత్యేక చొరవ చూపిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి మృతుడి బంధువుల కృతజ్ఞతలు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జనవరి 03:
తమిళనాడు రాష్ట్రం చెన్నై నగరంలోని మేరీనా బీచ్ లో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఈ నెల 1 వ తేదీన గల్లంతైన విద్యార్థి సాయి సంతోష్ రెడ్డి మృత దేహాన్ని శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో ప్రత్యేక గాలింపు బృందాలు గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. సవిత యూనివర్షటిలో బి ఈ మొదటి సంవత్సరం చదువుతున్న సాయి సంతోష్ రెడ్డి (18) బి ఈ మొదటి సంవ త్సరం చదువుతూ నూతన సంవత్సర 2025 జనవరి 1న స్నేహితులతో కలిసి సముద్రం లొకేషన్‌ను సందర్శిస్తుండగా మెరీనా బీచ్ నీటిలో మునిగిపోయారని మృతుడి తండ్రి వెంగళరెడ్డి, బాబాయ్ పక్కిరెడ్డిలు శుక్రవారం చెప్పారు. మృతదేహాన్ని గుర్తించేందుకు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రత్యేక చొరవ తీసుకొని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ దృష్టికి తీసుకెళ్లడంతో సిటీ పోలీసులు (డి6 అన్నా స్క్వేర్ పోలీస్ స్టేషన్) పోలీసులు తమ సామర్థ్యాల మేరకు వెళ్లగా , నేవీ, కోస్ట్ గార్డ్ కూడా పాల్గొని మృత దేహం కనుగొన్నారని వారు వివరించారు. మా బాబు మృతదేహం లభించేందుకు కృషి చేసిన మా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే 194 వ జయంతి వేడుకలు.

### -ఘనంగా నిర్వహించిన డెమొక్రటిక్ విద్యార్థి,యువజన సంఘం.

### -సావిత్రిబాయి పూలే ను మహిళలు, విద్యార్థినిలు ఆదర్శంగా తీసుకోవాలి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 03:నంద్యాల పట్టణంలో ఉన్న నారాయణ జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే 194 వ జయంతిని పూలమాలలతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డెమోక్రటిక్ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్. రియాజ్,నారాయణ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ క్రిష్ణ రెడ్డిలి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహారాష్ట్ర లోని సతారా జిల్లాలో మాయా గాని అనే గ్రామంలో 18 31 జనవరి 3 న ఓ చిన్న సన్నకారు రైతు కుటుంబంలో జన్మించారు. సావిత్రిబాయి పూలే గారి కి తన 9వ ఏట 12 ఏళ్ల జ్యోతి రావు పూలే కి ఇచ్చి 1840 లో వివాహం చేసుకున్నారు. జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతోనే ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి,విద్యావంతురాలైనదని,సావిత్రిబాయి పూలే గారు అట్టడుగు వర్గాల మహిళలు చదువులకు సంపద వంటి సమస్త హక్కులకోసం, దేశంలో అప్పటి కట్టుబాట్లను, సాంప్రదాయాలను ఆధిపత్య వర్గాలను ధిక్కరించి భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా 1848లో లో మొట్ట మొదటి పాఠశాలను ప్రారంభించారు, స్త్రీలకు విద్య అందించడానికి ఉపాధ్యాయురాలిగా వెళు _న్న సమయంలో అనేక అవమానాలు ఎదురైనా కూడా పట్టించుకోకుండా స్త్రీల విద్య అభివృద్ధికి కృషి చేసిందని, అంటరానితనం,కుల నిర్మూలన, కోసం పోరాడిన సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే భార్య సావిత్రిబాయి పూలే అని వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో నారాయణ కళాశాల అంజన్ రెడ్డి,చిన్ని, మరియు విద్యార్థినీ విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు

# మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు ప్రభుత్వం చేసిన ఒప్పందాలను అమలు చేయాలి.

### -ఎ పి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్.

ఆంధ్ర ప్రగతి డౌన్ జనవరి 03:
మున్సిపాలిటీ లో పనిచేస్తున్న పారిశుధ్య,ఇంజనీరింగ్ అండ్ స్ట్రీట్ లైటింగ్ కార్మికులకు గత 16 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం చేసిన ఒప్పందాలను అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం,పట్టణ,మండల అధ్యక్షులు పి.రామాంజనేయులు, నక్కశ్రీకాంత్ కోశాధికారి బి.నాగమద్దయ్య,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు కె.పెద్దఎల్లయ్య,ఎ.కుల్లాయప్ప డిమాండు చేశారు.రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం దగ్గర ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ కి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ సమ్మె కాలం ఒప్పందాలతో పాటు డోన్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న స్థానిక సమస్యలపై పదే పదే నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూ అధికారుల దృష్టికి తెస్తున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని మీరు చేసే వినతులను పైకి పంపుతున్నాము అక్కడి నుండి అనుమతులు రాలేదంటూ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని వెంటపడి సమస్యలు పరిష్కరించడంలో విఫలం అవుతున్నారని ఇది సరికాదని ఇప్పటికైనా అధికారుల తీరు మారాలని పనులు చేపించుకోవడంపై ఉన్న శ్రద్ధ కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల కూడా చూపాలని లేని యెడల ఉద్యమాలను ఉద్రుతం




చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏ స ం , చ ే ఎ ల రామాంజి,ఓబులేసు,వెంకటలక్ష్మి,రంగనాయకులమ్మ తదితరులు పాల్గొన్నారు.

1) మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం పొందిన 7 మంది మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు రూ.2,00,000 లక్షల ఎక్స్గ్రేషియా వెంటనే చెల్లించాలి.

2) మరణించిన మరియు రిటైర్మెంట్ అయిన కార్మికుల కుటుంబ సభ్యులను ఉద్యోగాలలోకి తీసుకోవడానికి ఆప్కాస్ ఆమోదం కొరకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి.

3) పిఎఫ్,ఈఎస్ఐ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

4) సంక్రాంతి కానుక రూ.1000 రూపాయలు



వెంటనే ఇవ్వాలి

5) పారిశుధ్య కార్మికులకు పెండింగ్ లో ఉన్న ఒక నెల హెల్త్ అలవెన్స్ వెంటనే ఇవ్వాలి

6) పర్మినెంట్ మరియు ఆప్కాస్ కార్మికులకు బట్టలు,చెప్పులు,నబ్బులు,నూనెలు,రక్షణ పరికరాలు,పనిముట్లు వెంటనే ఇవ్వాలి

7) వాహనాల రిపేర్ల ఖర్చు డ్రైవర్ల పై మోపకుండా మున్సిపాలిటీ నుండే చెల్లించాలి,అర్హతలు కలిగిన డ్రైవర్లకు రూ.24,500 రూపాయల వేతనాలు ఇవ్వాలి8) మున్సిపల్ ఇంజనీరింగ్,కాంట్రాక్టు/ అవుట్ సోర్సింగ్ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలి

9) ఇంజనీరింగ్ కార్మికులకు కూడా జి.ఓ.యం.ఎస్.నెం.36 ప్రకారం పారిశుధ్య కార్మికులకు ఇచ్చే విధంగా రూ.21,000/-ల ప్రకారం వేతనాలు ఇవ్వాలి.

10) రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలి.

# ప్రపంచ దేశాలు మెచ్చిన నేత మన్మోహన్ సింగ్.

### _ కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 03:
ప్రపంచ దేశాలు మెచ్చిన నేత స్వర్గీయ డాక్టర్ మన్మోహన్ సింగ్ గారని పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య కొనియాడారు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ మన్మోహన్ సింగ్ గారి సంతాప సభ పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీ సి సి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు మాట్లాడుతూ.. మాట్లాడుతూ దేశానికి నీతివంతమైన పాలన అందించిన వ్యక్తి మన్మోహన్ సింగ్ గారని పాకిస్తాన్ మరియు భారతదేశం రెండు దేశాలు సంతాపదినాలు ప్రకటించాయని మన్మోహన్ సింగ్ గారు 1932 సెప్టెంబర్ 26న జన్మించారని ఆయన కేం బ్రిడ్జి నుంచి ఆర్థిక శాస్త్రంలో ట్రై పోస్, ఆక్స్ఫర్డ్ నుంచి ఎం. ఏ. డి. ఫి.ఎల్ 1962లో హెూనరీస్ కాసా నుండి డి.లీట్. 1982 నుంచి 85 వరకు ఆర్బిఐ గవర్నర్ గా, 1987లో పద్మ విభూషణ్ పురస్కారం గ్రహీతగా, 1991 నుండి 96 వరకు ఆర్థిక శాఖ మంత్రిగా 2004 నుండి 2014 వరకు భారత దేశ ప్రధాన మంత్రిగా ఎన్నో సాహసోపేత పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత మన్మోహన్ సింగ్ కి దక్కుతుందని మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేద ప్రజలకు ఎంతో ఉపాధి కల్పించిందని, అలాగే సమాచార హక్కు చట్టం తీసుకు వచ్చిన ఘనత మన్మోహన్ సింగ్ గారిదని ఆయన సేవలను కొనియాడారు. అనంతరం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య మాట్లాడుతూ శ్రీమతి సోనియా గాంధీ ప్రధాని పదవిని తిరస్కరించినప్పుడు వెంటనే గుర్తుకు



వచ్చిన పేరు మన్మోహన్ సింగ్ పేరు అని ఆయన ప్రధానిగా పది సంవత్సరములు పనిచేశారని రోజు 18 గంటలు పని చేసేవారని ఆయన సేవలను కొనియాడారు. అనంతరం సేవ దళ్ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ ఖాన్ మాట్లాడుతూ దేశం గొప్ప వ్యక్తిని కోల్పోయిందని, దేశ ప్రజల తలరాతలు మార్చిన వ్యక్తి మన్మోహన్ సింగ్ గారని ప్రపంచ బ్యాంకు అప్పు ఇవ్వకపోతే 42 టన్నుల బంగారాన్ని తాకట్టు పెట్టి అప్పు తెచ్చారని అప్పుల్లో ఉన్న దేశాన్ని, అప్పులు ఇచ్చే దేశంగా తీర్చిదిద్దిన ఘనత మన్మోహన్ సింగ్ దని ఆయన హయాంలో కస్తూరిబా, మోడల్ స్కూల్ ప్రతి మండలంలో స్థాపించబడ్డాయని తోపుడుబండ్ల వ్యాపారస్తులకు ఎక్కడైనా అమ్ముకునే వీలు కల్పించిన ఘనత మన్మోహన్ సింగ్ దని ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు మన్మోహన్ సింగ్ గారని దేశం, దేశ ప్రజలు సుఖంగా ఉండాలని కోరుకునే వ్యక్తి డాక్టర్ మన్మోహన్ సింగ్ గారని ఆయన సేవలను కొనియాడారు. ముందుగా మన్మోహన్ సింగ్ గారి చిత్రపటమునకు పూలమాలలు వేసి రెండు నిమిషములు మౌనం పాటించిన అనంతరం సంతాప సభలో వక్తలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు, పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య, సేవల రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ ఖాన్, సీనియర్ నాయకులు ఎస్ వై డి ప్రసాద్ , ఆహమ్మద్ ఖాన్, శ్రీశైలం నియోజకవర్గం కోఆర్డినేటర్ జజ్జర రవిబాబు, బండి ఆత్మకూరు మండలం ఎస్సి సెల్ అధ్యక్షులు పబ్బతి అబ్రహం, సలాం, ఆనందరావు నరసింహులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కడపలో ఉక్కు ఫ్యాక్టరీ సాధనకై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు..!

### -మహాసభల లోగో విడుదల చేసిన నేతలు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జనవరి 03:
అత్యంత వెనక ఉన్న ప్రాంతం రాయలసీమ కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం కోసం నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న నేపథ్యంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్ బాబు తెలిపారు.శుక్రవారంనాడు సిపిఐ జిల్లా కార్యాలయం స్వామి రెడ్డి భవన్ నందు ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభల లోగోను ఏఐవైఎఫ్ మాజీ జిల్లా నాయకులు షేక్ బాబా ఫక్రుద్దీన్, షేక్ రియాజ్, నాగరాముడులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లెనిన్ బాబు మాట్లాడుతూ కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణ కోసం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ,చంద్రబాబు నాయుడు, జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేసిన అది ఆచరణలో సాధ్యం కావడం లేదని , నిధులు కేటాయింపులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం కారణంగా కడప ఉక్కు ఫ్యాక్టరీ ఒక ఆశగా మిగిలిపోతున్న నేపథ్యం ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా కలిసి వచ్చే అన్ని విద్యార్థిను సంఘాలు కలుపుకొని ఉద్యమాలు నిర్వహిస్తావని సందర్భంగా తెలిపారు. 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని నేడు ప్రైవేటుకరణ చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని, లాభాలు ఉన్నటువంటి ఉక్కు ఫ్యాక్టరీని ఎలా ప్రైవేట్ పరం చేస్తారని ప్రశ్నించారు. కేంద్ర మోడీ ప్రభుత్వం కొత్త సంస్థల ఏర్పాటు చేయకుండా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేస్తూ కార్పొరేట్ విధానాల అవలంబించడం సిగ్గుచేటని, మోడీ విధానం వల్ల దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోతుందని విమర్శించారు. రైల్వే ఎల్ఐసి బిఎస్ఎన్ఎల్ విమానాశ్రయాలు వివిధ ప్రభుత్వ రంగ సమస్యలు మూసివేసి ప్రైవేటు కన్నా చేస్తూ నిరుద్యోగం పెంచడంలో మోడీ ప్రభుత్వం ప్రథమ స్థానం సాధిస్తుందని అన్నారు. దేశాంతంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కోసం కృషి చేయాలని తెలిపారు. నేడు రాష్ట్రంలో కోటమీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెగా డీఎస్సీ ప్రకటనలకే పరిమితమైందని, లక్షలాది ఖాళీగా ఉన్న ఉద్యోగాలపై స్పందించకపోవడం బాధాకరమని, రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నేపథ్యంలో అమరావతిని ఫ్రీ జోన్ చేసి అక్కడ భర్తీ చేసే ఉద్యోగాల్లో 26 జిల్లాల నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి కేంద్రీకరణ కాకుండా చేయాలని ఒకే ప్రాంతం అభివృద్ధి అయితే వెనుకబడిన ప్రాంతాలు తీవ్ర నష్టం జరిగే అవకాశాలు నాయన తెలిపారు. ప్రభుత్వ రంగం రోజురోజుకీ తగ్గిపోతూ ప్రైవేట్ రంగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు కల్పించి బడుగు బలహీన నిరుద్యోగులకు అందరు కూడా అవకాశం కల్పించాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ సాధన కోసం ఉద్యమిస్తామని తెలిపారు.
శ్రీకాకుళంలో ఏఐవైఎఫ్ 22 రాష్ట్ర మహాసభలు
అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభ ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు శ్రీకాకుళం నగరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభల లోగో శ్రీకాకుళం రైతాంగ సాయిధ




పోరాటం, సముద్రం లైట్ హౌస్, స్వాతంత్ర సమరయోధుడు యువ కిశోరం భగత్ సింగ్ ఫోటోతో ముద్రించినటువంటి లోగోనో విడుదల వేశారు. ఈ మాస వల్ల ఫిబ్రవరి 6న వేలాది మంది యువజన ప్రదర్శన బహిరంగ సభ నిర్వహిస్తామని , 7 8 9 తేదీల్లో 26 జిల్లాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.
22వ రాష్ట్ర మహాసభల్లో సమగ్ర యువజన విధానం, నువ్వు తన పరిశ్రమల స్థాపన కోసం, వెనుకబడిన ఉత్తరాంధ్ర రాయలసీమ జిల్లాల అభివృద్ధి కోసం, త్రాగునీరు సాగునీరు ప్రాజెక్టుల సాధనే లక్ష్యంగా వివిధ అంశాలపై చర్చించి రాష్ట్రంలో ఉద్యమాలు కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జి నాగరాముడు, ఏఐవైఎఫ్ నాయకులు వెంకట్ , హరి తదితరులు పాల్గొన్నారు.
జి నాగరాముడు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# పథకాల అమలు పక్కాగా సాగాలి !

పథకాలు ఏవైనా ఓటు బ్యాంక్‌తో కాకుండా..ప్రజల సర్వతో ముఖాభివృద్ధిని కాంక్షించి కొనసాగించాలి. అవసరం మేరకే పథకాలను ప్రవేశ పెట్టడం జరగాలి. అలా జరిగినప్పుడే వాటికి సార్థకత ఉంటుంది. కొత్తగా రేషన్ కార్డుల మంజూరు, రైతుభరోసాకోసం తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్తగా మళ్లీ రేషన్ కార్డులు ఇస్తామని కూడా అంటున్నారు. ఇప్పటికే జనాభాను మించి పేద కుటుంబాలను గుర్తించి బియ్యం పంపిణీ చేస్తున్నారు. ధరలు పెరిగిన నేటి కాలంలో కిలో రూపాయి బియ్యం పక్కదారి పడుతున్నాయి. ఎపిలో వేలకోట్ల రూపాయల బియ్యం పక్కదారి పట్టాయి. గోడౌన్ల నుంచే మాయం అయ్యాయి. నేతలే సూత్రధారులుగా మారి పక్కదారి పట్టించారు. ఇలాంటి సమయంలో తెలుగు రాష్ట్రాల్లో బియ్యం పథకాన్ని తక్షణం సమీక్షించాలి. వ్యాపారంగా మారిన చౌకబియ్యం ధరలను పెంచాలి. అలాగే పేదలను గుర్తించి వారికి మాత్రమే బియ్యం అందేలా చేయాలి. దీంతో ఖజానకు వేలకోట్లు ఆదా అవుతాయి. దీనిని సంస్కరించకుండా పోరాదు. ఉచిత విద్యుత్ కూడా సక్రమంగా పొలాలకు వెళ్లేది లేనిది లెక్క కట్టాలి. రైతుభరోసా కూడా కేవలం పంటలు వేసే వారికి అందాలి. ఈ పథకాలను పక్కాగా లెక్కలు తీసి అమలు చేయాలి. అప్పుడు వేలకోట్లు ఆదా కావడంతో ఖజానాకు భారం తప్పుతుంది. రైతుభరోసాకు సంబంధించి త్వరలో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించదిం, రైతు భరోసాపై మంత్రివర్గానికి చేయాల్సిన సిఫార్సులపై కేబినెట్ సబ్ కమిటీ చర్చించింది. సాగు చేసే ప్రతి రైతుకు రైతు భరోసా ఇవ్వాలని కమిటీ నిర్ణయించింది. రైతు భరోసాకు ఐటీ చెల్లింపు, భూమి పరిమితిని పెట్టవద్దని కమిటీ అభిప్రాయపడింది. అలాగే, రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని సబ్ కమిటీ నిర్ణయించింది. ఇదే సందర్భంలో రేషన్ బియ్యం, ఉచిత విద్యుత్ పొందుతున్న రైతుల నుంచి కూడా దరఖాస్తులు తీసుకోవాలి. ఇక్కడే ఎవరు పేదో..ఎవరు కాదో తెలుస్తుంది. గ్రామాల్లో ఎవరెవరు ఉచితంగా పథకాలు అప్పనంగా పొందుతున్నారో క్షేత్రస్థాయి అధికారులకు తెలుసు. పక్కాగా వీటిని అమలు చేయడంలో ఎవరికీ అభ్యంతరాలు ఉండవు. రైతుభరోసా కోసం అధికారుల సర్వే, శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా సాగు భూములను గుర్తించాలనుకోవడం మంచిదే. గతంలో లాగా ఎవరికి పడితే వారికి రైతుభరోసా పేరుతో దుబారా చేయకపోవడం మంచిదే. ఇది పంటలు పండించే రైతులకు కూడా ధైర్యం ఇచ్చేది కానుంది.




జనవరి 5 నుంచి 7 వరకు రైతు భరోసా దరఖాస్తులు స్వీకరించే అవకాశముందని, సంక్రాంతి పండుగ తర్వాత సర్కార్ రైతు భరోసాను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతున్న వేళ... ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిందే. కేబినెట్ భేటీలో రైతు భరోసాకు సంబంధించి తుది నిర్ణయం తీసుకోనున్నందున వివరాలు సేకరించడంలో తప్పలేదు. గత ప్రభుత్వం ఒక కోటీ 53 లక్షల ఎకరాలకు రైతుబంధు ఇచ్చింది. గుట్టలు, వెంచర్లు, సాగుచేయని భూములకు కూడా గత ప్రభుత్వం రైతు బంధు ఇచ్చి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిందని, ఇప్పుడు అలా కాకుండా కేవలం సాగు చేసే భూములకు రైతు భరో సా నిధులు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ధరణి పోర్టల్ రికార్డుల ప్రకారం ఒకకోటి 53 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా ఇందులో సాగుచేసే భూమి కోటి 30 లక్షలు ఎకరాలుగా ప్రభుత్వం గుర్తించింది. కేవలం ఈ భూ ములకే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. తెలంగాణ విస్తీర్ణం 1,12,000 చదరపు కిలోమీటర్లు... అంటే దాదాపు 2 కోట్ల 75 లక్షల ఎకరాల భూమి. దీనిలో కోటీ 60 లక్షల ఎకరాలు వ్యవసాయ భూమి, 66 లక్షల ఎకరాలు అటవీ భూమి, మిగిలినవి గ్రామకంఠాలు, పట్టణాలు, దేవాలయ మాన్యాలు, వక్ఫ్, ఇనాం, శిఖం కింద ఉన్నాయి. ఈ లెక్కలన్నీ కూడా ఉజ్జాయింపు లెక్కలే కానీ, వాస్తవమైన రుజువులు చేయగలిగే స్పష్టమైన లెక్కలు లేవు. దీని కోసం ఎంత కష్టమైనా పొజిషన్ ప్రకారం సమగ్ర భూసర్వే చేసి తీరాలి. భూమికి సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ హామీ మేరకు కార్యాచరణ సాగాలి. అన్యాక్రాంతం, కబ్జా అయిన ప్రభుత్వ భూముల రక్షణ తో పాటు దేవాదాయ భూములను కూడా రక్షించాలి. ఇందుకోసం ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేయాలి. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌లో అవతవకలు జరిగాయని గుర్తించినందున సరిదిద్దే పనిలో పారదర్శకంగా, పక్కాగా పనిచేయాలి. నిజానికి తెలంగాణ భూ సమాచారం విషయంలో దాపరికాలు ఏమీ ఉండవు. ఏ ఊరిలోకి వెళ్లినా, ఈ భూమి ఎవరిది అని అడిగినా... పూర్తి సమాచారాన్ని ప్రజలు నోటితో చెప్పేస్తారు. అటువంటి తెలంగాణలో భూ విషయంలో రహస్యం చేయడం వెనక ఉన్న మతలబు ఎవరికీ అర్థం కాలేదు. నేడు భూమాతలో ప్రతి విషయాన్ని నిర్భయంగా, నిర్దిష్టంగా తెలుసుకునే అవకాశం కల్పించారు. రానున్న మూడు నెలల్లో మరిన్ని అంశాలను పొందుపరుస్తూ, నిపుణుల నుండి మరికొన్ని సూచనలు, సలహాలు తీసుకొని తెలంగాణ రైతాంగ సమస్యలను తీర్చేందుకు, సులువైన మార్గాలను పొందుపరిచేందుకు ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా భూమాత పనిచేస్తే రైతులకు గొప్ప భరోసా కల్పించినట్లే అవుతుంది. ఈ క్రమంలోరైతు భరోసా సాయం మీద కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం పాస్ పుస్తకం ఉన్న ప్రతి ఒక్కరికి రైతుబంధు ఇచ్చింది. కొండలు, గుట్టలు, ఫామ్‌హౌస్‌లు, కంచెలకు కూడా డబ్బులిచ్చింది. ఈ ప్రభుత్వం కేవలం వ్యవసాయానికి మాత్రమే సాయం అందించాలనే దృఢమైన లక్ష్యంతో ఉన్నది. ప్రతి గ్రామంలోని విలేజ్ అగ్రికల్చరల్ ఆఫీసర్, శాటిలైట్ సహాయంతో పంట పొలాలను గుర్తించి నిజమైన రైతులకు సాయం అందించేందుకు రంగం సిద్ధం చేస్తున్నా తీరు అభినందనీయం. ఈ క్రమంలో విద్యుత్ వాడకం, చౌకబియ్యం సరఫరాలపైనా దృష్టి పెడితే మంచిది.

## ఫసల్‌బీమాపై అవగాహన కల్పించాలి

### పథకం పొడించిన నేపథ్యంలో రైతుల్లో చర్చ చేయాలి

న్యూఢిల్లీ,: 2026 వరకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పొడిగింపునకు కేంద్రం ఆమోదించింది. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని కొనసాగించడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన నేపథ్యంలో ఈ విషయంలో రైతులకు అవగాహన కల్పించాలి. అలసు ఎంతమంది రైతులు ఇందులో చేరారో, దాని ప్రయోజనం సమకూరుతుందా లేదా అన్నది కూడా ఆలోచన చేయాలి. దేశంలో పంటల బీమా అన్నది ఓ వృధా ప్రయాసగా మారింది. అలా కాకుండా పక్కగా అమలు జరగాలి. రైతులకు పంటల బీమాపై అవగాహన ఉండాలి. మొత్తం 69,515.71 కోట్ల బడ్జెట్‌తో 2025-26 వరకు పొడిగిస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. కొత్త సంవత్సరం మన దేశ ప్రజల జీవితాల్లో ఆనందం, శ్రేయస్సును తీసుకురావడంతోపాటు అభివృద్ధి చెందిన భారతదేశంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంకల్పాన్ని మనం నెరవేర్చగలుగుతామని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనతో పాటు బియ్యం ఎగుమతి విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పారు. అభివృద్ధి చెందిన భారతదేశం సాధించడానికి 2024 సంవత్సరం ప్రాతిపదికగా మారిందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచి వారిని స్వావలంబన చేసే దిశగా విశేష కృషి జరిగిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో 2024వ సంవత్సరం అభివృద్ధి చెందిన భారతదేశ లక్ష్య సాధనకు పునాదిగా మారిందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి చౌహాన్ అన్నారు. గత పదేళ్లలో వ్యవసాయ రంగంలో అపూర్వమైన విజయాలు సాధించామన్నారు. వ్యవసాయం, రైతులకు సంబంధించిన అనేక ముఖ్యమైన బహుమతులను ప్రధాని ప్రతి



మంత్రివర్గానికి అందించారన్నారు. రైతులకు సేవ చేయడమే మోదీ ప్రభుత్వానికి దేవుడి పూజతో సమానమన్నారు. 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన' విడుదలతో ప్రధానమంత్రి తన మూడవ దఫాను ప్రారంభించి 9.26 కోట్ల మంది రైతులకు నేరుగా రూ.20 వేల కోట్లు పంపారని తెలిపారు. అంతేకాకుండా, 109 వాతావరణ అనుకూల రకాల పంటలను రైతులకు అంకితం చేశారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2024-25 కోసం 14 ఖరీఫ్ పంటలపై కనీస మద్దతు ధరను పెంచడానికి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. బియ్యంపై కనీస ఎగుమతి ధరను తొలగించామని, బాస్మతియేతర వైట్ రైస్ వ్యాపారంపై భారత్-ఇండోనేషియా మధ్య ఎంఓయూ కుదిరింది. భారతదేశం ఒక మిలియన్ మెట్రిక్ టన్నుల బాస్మతియేతర తెల్ల బియ్యాన్ని ఎగుమతి చేయనున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. రూ. 69,515.71 కోట్ల వ్యయంతో 2025-26 వరకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని కొనసాగించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2024లో 4 కోట్ల మందికి పైగా రైతులు లబ్ది పొందారు, ఈ పథకాన్ని 2026 వరకు పొడిగించినట్లు శివరాజ్ సింగ్ వెల్లడించారు. ఈ నిర్ణయం 2025-26 నాటికి దేశవ్యాప్తంగా రైతులకు ప్రకృతి వైపరీత్యాల నుండి పంటలను నష్టపరిచేందుకు సహాయపడుతుంది. ఇంకా, పథకం అమలులో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా ఉపయోగించడం వల్ల పారదర్శకతగా పరిష్కారం దొరుకుతుందన్నారు. అలాగే, రూ. 824.77 కోట్ల కార్పస్‌తో ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫండ్ (ఈఎం÷) ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు మంత్రి తెలిపారు. ఈ ఫండ్ జఇ÷ూ-÷ఇఅఊ, చిఎఔఆ÷ూ వంటి సాంకేతిక కార్యక్రమాలకు అలాగే పథకం కింద పరిశోధన, వ్యవసాయాభివృద్ధి అధ్యయనాలకు ఆర్థిక సహాయం చేయడానికి ఉపయోగించడం జరుగుతుందన్నారు. సాంకేతికత ఆధారిత దిగుబడి అంచనాలకు కనీసం 30 శాతం వెయిటేజీతో దిగుబడి అంచనా కోసం రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీని ఉపయోగిస్తుంది. ప్రస్తుతం తొమ్మిది ప్రధాన రాష్ట్రాలు దీనిని అమలు చేస్తున్నాయి. వాటిలో ఆంధ్రప్రదేశ్, అస్సాం, హర్యానా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఉన్నాయి. ఇందులో ఇతర రాష్ట్రాలను కూడా వేగంగా చేర్చుతున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. జఇ÷ూ-÷ఇఅఊ విస్తృత అమలుతో, పంట కోత ప్రయోగాలు, సంబంధిత సమస్యలు క్రమంగా ముగుస్తాయని ఆయన అశాభావం వ్యక్తం చేశారు. ఇక ఈశాన్య రాష్ట్రాల రైతులందరినీ ప్రాధాన్యతా ప్రాతిపదికన సంతృప్తిపరిచేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, మరింత ముందుకు సాగుతామని కేంద్ర మంత్రి తెలిపారు. అయితే, ఈ పథకం స్వచ్ఛందంగా, ఈశాన్య రాష్ట్రాలలో స్థూల పంటల విస్తీర్ణం తక్కువగా ఉన్నందున, అవసరమయ్యే నిధులు కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు.

## తిరుమలలో వైకుంఠ ఏకాదశి సందడి


### వైకుంఠ ద్వారదర్శనం కోసం ఏర్పాట్లు



తిరుమల,:: తిరుమలలో జనవరి 10 నుండి 19వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనానికి విచ్చేసే యాత్రికుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టిటిడి అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి చెప్పారు. తిరుమలలోని పలు ప్రాంతాలను అదనపు ఇఒ, జెఇఒ వీరబ్రహ్మం, జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు, సివిఎస్వో శ్రీధర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో అదనపు ఇఒ మాట్లాడుతూ.. వైకుంఠ ద్వార దర్శనానికి విచ్చేసే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా టిటిడి అధికారులు, విజిలెన్స్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో శ్రీవారి దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. జనవరి 10, 11, 12వ తేదీలలో అధిక సంఖ్యలో యాత్రికులు రానున్న నేపథ్యంలో అధికారులతో చర్చించి పూర్తి స్థాయిలో ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. దర్శనానికి విచ్చేసే విఐపిలకు వారికి అందించే పాసులలోనే దర్శన సమయం, పార్కింగ్ ప్రాంతం, ప్రవేశ, నిష్క్రమణ గేట్ల వివరాలు పొందిపరిచనున్నట్లు తెలిపారు. విఐపిలు, యాత్రికులు తమకు కేటాయించిన సమయం ప్రకారం మాత్రమే దర్శనానికి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. యాత్రికులు తమ పాదరక్షలను గదులలో, వారి వాహనాలలో వదలి రావాలన్నారు. అధిక రద్దీ నేపథ్యంలో తోటి యాత్రికులకు ఇబ్బంది లేకుండా పారిశుద్ధ్యాని పాటించాలని, వ్యర్థాలను టిటిడి ఏర్పాటు చేసిన డస్ట్ బిన్లలోనే వేయాలని కోరారు.

## ట్రంప్ రాకకకు ముందే అనేక డిమాండ్లు

### ఓపిటిపై అప్పడే మొదలైన ఆందోళనలు



వాషింగ్టన్,: ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు స్వకరించడానికి ముందే అనేక అంవాలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయి. ఇందులో వీసాలు మొదలు, ఓపిటి వరకు చర్చకు తెరతీసాయి. ఇదే సమయంలో అంతర్జాతీయ విద్యార్థులు పని అనుభవం సంపాదించేందుకు వాడే ది ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) ప్రోగ్రామ్‌కు ముగింపు పలకాలన్న ఒత్తిడి పెరుగుతోంది. అమెరికన్లకు లభించాల్సిన జాబ్స్‌ను ఈ ప్రోగ్రాం కింద వచ్చిన విదేశీ విద్యార్థులు ఎగరేసుకుపోతున్నారనే ఆందోళనలు తీవ్రమయ్యాయి. సంప్రదాయ మార్గాలను బైపాస్ చేసి.. దీర్ఘకాలిక వలసలకు కూడా దీనిని విద్యార్థులు వాడుకొంటున్నారనే విమర్శలొస్తున్నాయి. వాస్తవానికి ఓపీటీ కార్యక్రమాన్ని తాత్కాలికంగా స్కిల్ డెవలప్‌మెంట్ కోసం వినియోగిస్తారు. దీనికింద ఎఫ్-1 వీసా ఉన్న విద్యార్థులు స్టెమ్ డిగ్రీ పూర్తి చేస్తే అమెరికాలో మూడేళ్లపాటు పనిచేసే అవకాశం లభిస్తుంది. ఈ కార్యక్రమానికి ఆ దేశ కాంగ్రెస్ అనుమతి లేదని విమర్శకులు తరచూ ప్రస్తావిస్తుంటారు. అంతేకాదు.. ఈ విద్యార్థులు అమెరికన్ స్టూడెంట్లతో కలిసి ఉద్యోగాల కోసం పోటీపడుతున్నారని ఆరోపిస్తున్నారు. అమెరికా జాబ్ మార్కెట్‌కు దీన్ని దొడ్డిదారిగా అభివర్ణిస్తుంటారు. అమెరికా టెక్ వర్కర్స్ గ్రూప్ ఈ ప్రోగ్రామ్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. 'ఓపీటీకి అతిథి ఉద్యోగుల స్కీమ్. దీనికి విదేశీ విద్యార్థుల ఇంటర్న్‌షిప్ అనే ముసుగు వేశారు. విశ్వవిద్యాలయాలు చదువుకు బదులు వర్క్‌పర్మిట్లను విక్రయిస్తున్నాయి. ట్రంప్ అమెరికాను రక్షించేందుకు, ఇక్కడి విద్యార్థులకు ఎదురయ్యే అన్యాయమైన పోటీని తొలగించేందుకు.. ఈ ఓపీటీ ప్రోగ్రామ్‌ను ముగించాలని కోరింది. ఇప్పటికే వాషింగ్టన్ అలయన్స్ ఆఫ్ టెక్నాలజీ వర్కర్స్ ఓపీటీపై 2023లో కోర్టును ఆశ్రయించింది. ఇది అమెరికా ఉద్యోగులకు హాని చేస్తోందని ఆరోపించింది. కానీ, కింది కోర్టు మాత్రం ఈ ప్రోగ్రామ్‌ను సమర్థించింది. మరోవైపు కొందరు చట్టసభ సభ్యులు అసలు ఈ కార్యక్రమాన్నే రద్దు చేయించేందుకు సన్నద్ధమవుతున్నారు. భారత విద్యార్థులు వృత్తిపరమైన అవకాశాలు.. హెచ్1బీ వీసాల కోసం ఈ ఓపీటీ ప్రోగ్రామ్‌పైనే ఆధారపడతారు. ఇప్పుడు ట్రంప్ వచ్చాక దీనిపై సమీక్షిస్తే నష్టపోయేది భారతీయ విద్యార్థులే.


## త్వరలోనే వందేభారత్ స్లీపర్ రైళ్లు

**180 కిమీ వేగంతో**

**దూసుకు పోయేలా పరీక్షలు**

**అన్ని పరీక్షల్లోనూ నెగ్గినట్లు గుర్తింపు**

న్యూఢిల్లీ,:త్వరలోనే వందేభారత్ స్లీపర్ రైళ్లు కూడా మనలను పలకరించ బోతున్నాయి. ఇప్పటికే వందేభారత్ రైళ్లు సంచలనంగా మారడంతో పాటు, ప్రయాణికులు కూడా బాగా ఆదరిస్తున్నారు. రైల్వేల చరిత్రలో ఇవి విప్లవాత్మకంగా మారయి. ఈ క్రమంలో దేశంలో మొట్టమొదటిసారిగా వందే భారత్ స్లీపర్ రైళ్లను పట్టాలు ఎక్కించేందుకు రైల్వే శాఖ ముమ్మర కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే రైలు వేగాన్ని క్రమక్రమంగా పెంచేందుకు పలు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లో రైలు గరిష్ఠంగా గంటకు 180 కిలోమీటర్ల వేగాన్ని అందుకున్నట్లు తెలిసింది. ఈమేరకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఓ వీడియోను షేర్ చేశారు. అందులో వందే భారత్ స్లీపర్ రైలు 180కిలోమీటర్ల వేగంతో రయ్‌రయ్‌మంటూ దూసుకెళ్లింది. అంత వేగంలోనూ రైల్లో సీటు వద్ద ఉన్న ట్రేపై పెట్టిన గ్లాసులో చుక్క నీరు కూడా కింద పడకపోవడం విశేషం. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సూచనల మేరకు రాజస్థాన్‌లోని కోటా రైల్వే డివిజన్‌లో ఈ పరీక్షలు నిర్వహించారు. తొలుత జనవరి



1న రైలును 130 కి.మీ వేగంతో నడిపారు. ఆ తర్వాత వేగాన్ని 140, 150, 160కి పెంచారు. తాజాగా గురువారం ఈ వేగాన్ని గంటకు 180 కిలోమీటర్లకు పెంచారు. రాజస్థాన్‌లోని కోటా నుంచి లబాన్ స్టేషన్ల మధ్య 180 కిమీ వేగంతో దూసుకెళ్లింది. ఆ సమయంలో సాధారణ ప్రయాణికులను సమం చేసేంత బరువును రైల్లో ఉంచారు. విభిన్నమైన ట్రాక్ పరిస్థితుల్లో దీన్ని పరీక్షించారు. వచ్చే నెలలోనూ ఈ ట్రయల్స్ కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు. మరికొన్ని నెలల్లో వందే భారత్ స్లీపర్ రైళ్లను పట్టాలెక్కించే అవకాశాలున్నాయి. ఈ స్లీపర్ రైల్లో మొత్తం 16 బోగీలు ఉంటాయని అందులో 10 థర్డ్ ఏసీకి, 4 సెకండ్ ఏసీకి, ఒక బోగీ ఫస్ట్ ఏసీకి కేటాయించారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. వందే భారత్ స్లీపర్ రైలులో సీటింగ్‌తో పాటు లగేజీ కోసం రెండు బోగీలు అందుబాటులో ఉంటాయి. కొత్తగా సిద్ధం చేసిన వందేభారత్ స్లీపర్ కోచ్ రైలు పరీక్షల నిమిత్తం ఇటీవల కోటకు వచ్చింది. అక్కడ దానిపై బరువు ఉంచి, వేర్వేరు వేగంతో ఖాళీగా రన్ చేయడం ద్వారా పరీక్షించారు. అందులో బ్రేకింగ్ సిస్టమ్, ఎయిర్ సస్పెన్షన్, కప్లర్ ఫోర్స్‌లను పరీక్షించారు. ఈ రైలును గంటకు 180 కి.మీ వేగంతో నడిపారు. ఈ పరీక్ష డిసెంబర్ 31 నుంచి కోట రైల్వే డివిజన్‌లోని ఢిల్లీ-ముంబై రైల్వే ట్రాక్‌పై ప్రారంభమైంది. ఇందులో వందే భారత్ ట్రయల్ మొదట నాగ్డా మధ్య.. తర్వాత సవాయి మాధోపూర్, కోట మధ్య నిర్వహించబడుతోంది. ఈ పరీక్షల అనంతరం పూర్తి నివేదికను రైల్వే మంత్రిత్వ శాఖ, రైల్వే బోర్డుకు పంపనుంది. కోటా నాగ్డా రైల్వే సెక్షన్‌లోని రోహల్ ఖుర్ద్, చౌమహ్లా మధ్య మొదట్లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులతో సమానమైన బరువుతో నడిచింది. ఇందులో మొదట్లో 130, తర్వాత 140, తర్వాత 150 స్పీడ్‌తో ట్రయల్‌ను తీసుకున్నారు. దీని తర్వాత రైలును జనవరి 1న 160 వేగంతో, రోహల్ ఖుర్ద్ విక్రమ్‌ఘర్‌లో 177 వేగంతో అదే ట్రాక్‌పై పరీక్షించారు. అలాగే రోహల్ ఖుర్ద్, కోటా మధ్య 40 కిలోమీటర్ల దూరంలో 180 కి.మీ వేగంతో రైలు ట్రయల్ చేశారు. ఇందులో భాగంగా వందేభారత్ స్లీపర్ టెస్టింగ్ మూడో రోజు గురువారం కూడా జరిగింది. దీని కింద కోటా నుంచి లాబన్ మధ్య 30 కిలోమీటర్ల దూరంలో ప్రయాణికుల సమాన బరువును ఉంచుతూ వందే భారత్ 180 కి.మీ వేగంతో నడపబడింది. ఇవి సక్సెస్ అయితే ఇక ప్రయాణగమ్యం తగ్గి ప్రయాణం సుఖవంతంకానుంది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# 2024 సార్వత్రిక ఎన్నికల్లో అద్భుతం

## చరిత్రలో ఎన్నడూ లేనన్ని ఓట్లు రెండు జాతీయ పార్టీల సొంతం!

చరిత్రలో ఎన్నడూ లేనన్ని అత్యధిక ఓట్లను 2024 సార్వత్రిక ఎన్నికల్లోనే సొంతం చేసుకున్నాయి అధికార పార్టీ బీజేపీ, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్. అయినా కూడా ఆ రెండు పార్టీలకు చెప్పుకోదగ్గ స్థాయిలో సీట్లు దక్కలేదని తాజా నివేదికలు వెల్లడించాయి. బీజేపీ ఇదివరకు ఎన్నడూలేని విధంగా 23.59 కోట్ల ఓట్లు సాధించిందని, అయితే సొంతంగా అధికారం చేపట్టగలిగే మెజారిటీ మార్కు 272ను మాత్రం ఈ సారి చేరుకోలేకపోయిందని అందులో పేర్కొంది. కాంగ్రెస్ 13.67 కోట్ల ఓట్లను దక్కించుకున్నప్పటికీ, ఆ పార్టీ ప్రతిపక్ష హోదాకే పరిమితమైంది. 1984లో ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన ఎన్నికల ద్వారా కాంగ్రెస్ మరో తరంలోకి అడుగుపెట్టగా, ఇక అదే ఎన్నికల్లో కాలు మోపి బీజేపీ కొత్త తరం రాజకీయాలకు నాంది పలికింది. కానీ ఈ నాలుగు దశాబ్దాల కాలంలో కాంగ్రెస్ పార్టీ 11.54 కోట్ల ఓట్ల నుంచి 13.67 కోట్ల ఓట్లకు చేరగా, (18.42% వృద్ధి), బీజేపీ 1.82 కోట్ల నుంచి 23.59 కోట్లకు (1,196% వృద్ధి) ఎగబాకిందని నివేదికలు వెల్లడించాయి.

అయితే బీజేపీ 1996 (స్వల్పకాలం), 1998, 1999, 2014, 2019, 2024లలో, కాంగ్రెస్ 1984, 1991, 2004, 2009లలో అధికారాన్ని చేపట్టాయి. 1989, 1996లలో నేషనల్ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్ పేరుతో బీజేపీ, కాంగ్రెసేతర పక్షాలు స్వల్పకాలం వరకూ మాత్రమే అధికారాన్ని చెలాయించగలిగాయి. తాజాగా ఈ వివరాలను ఎన్నికల సంఘం విడుదల చేయడం గమనార్హం.





### ఆరు జాతీయ పార్టీలకు 63% ఓట్లు

మరోవైపు 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చెల్లిన ఓట్లలో 63శాతం ఓట్లను 6 జాతీయ పార్టీలు దక్కించుకున్నాయని తెలుస్తోంది. అయితే ఈ ఎన్నికల్లో వీటితో పాటు 47 గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీలు, అలాగే 690 రిజిస్టరైన, రిజిస్టరు కాని పార్టీలు కూడా పోటీ చేశాయి. ఇక ఈ ఎన్నికల్లో 3,921 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేయగా, అందులో కేవలం ఏడుగురు మాత్రమే విజయం సాధించారు. వారి ఓట్ల శాతం 2.79గా ఉంది.

## ట్రాఫిక్‌జామ్‌లో ఆసియాలోనే బెంగళూరు టాప్..

# ఏడాదికి 132 గంటలు రోడ్డుపైనే!

మన దేశంలో ట్రాఫిక్ జామ్ అంటే ముందుగా గుర్తొచ్చేది కర్ణాటక రాజధాని బెంగళూరు మహానగరమే. స్వల్ప దూరానికే గంటలు గంటలు వేచి చూడటం నగర పౌరులకు నిత్యం అనుభవమే. వాహనాల ట్రాఫిక్‌తో ప్రయాణం నరకప్రాయంగా ఉండే నగరాల జాబితాలో బెంగళూరుది దేశంలోనే అగ్రస్థానం. ఇప్పుడు ట్రాఫిక్ జామ్ పరంగా ఆసియాలోనే టాప్ 10 నగరాల జాబితాలో బెంగళూరు మొదటిస్థానంలో నిలిచింది. టామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్ 2023 ప్రకారం.. ఆసియాలోనే అత్యంత రద్దీగా ఉండే టాప్ 10 నగరాల జాబితాలో బెంగళూరు తొలి స్థానంలో నిలిచింది. ఇక్కడ పీక్ అవర్స్‌లో కేవలం 10 కిలోమీటర్ల దూరానికే ఏకంగా 28 నిమిషాల 10 సెకన్ల సమయం పడుతుంది. అంటే ఈ టెక్‌హబ్‌లోని నివాసితులు ఏటా దాదాపు 132 గంటలపాటు ట్రాఫిక్ జామ్‌లోనే చిక్కుకుపోతారు. అందుకు కారణంగా బెంగళూరులో రద్దీకి తోడు నగరం వేగంగా విస్తరిస్తుండటమే. దక్షిణ, ఉత్తర భారతదేశంలోని చాలా రాష్ట్రాల ప్రజలు ఎక్కువగా బెంగళూరుకే వెళ్తుంటారు. ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తూ అక్కడే నివసిస్తుంటారు. దీంతో పట్టణం కూడా బాగా విస్తరిస్తోంది. మరోవైపు ఈ సిలికాన్ సిటీలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు పాలకులు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం రావడం లేదు. నగర రోడ్లలో ప్రయాణం నరకయాతంగా మారిపోయింది. ఇక పీక్స్ అవర్స్, హాలిడేస్‌లో ట్రాఫిక్‌ను తప్పించుకోవడం పెద్ద టాస్క్‌గా మారింది. ఇక ఈ జాబితాలో బెంగళూరు తర్వాత పూణె రెండో స్థానంలో నిలిచింది. ఇక్కడ 10 కిలోమీటర్ల దూరానికి 27 నిమిషాల 50 సెకన్ల సమయం పడుతోంది. ఆ తర్వాత ఫిలిప్పీన్స్‌లోని మనీలా (27 నిమిషాల 20 సెకన్లు) , తైవాన్‌లోని తైచుంగ్ (26 నిమిషాల 50 సెకన్లు), జపాన్‌లోని సప్పోరో (26 నిమిషాల 50 సెకన్లు), తైవాన్‌లోని %ఖుశీఫ్ర్తంఅబఅస్త్ర జఱఎ% (26 నిమిషాలు), జపాన్‌లోని నగోయా (24 నిమిషాల 20 సెకన్లు), ఇండొనేషియాలోని జకార్తా (23 నిమిషాల 20 సెకన్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. టామ్‌టామ్ ట్రాఫిక్ సూచిక 6 ఖండాల్లోని 55 దేశాల్లో ఉన్న 387 నగరాల మీద రీసెర్చ్ చేసి నివేదిక విడుదల చేసింది. నగరాల్లో సగటు ప్రయాణ సమయం, ఇంధన ఖర్చులతోపాటు మరికొన్ని అంశాలను ఆధారంగా చేసుకొని నివేదికను సిద్ధం చేసింది. ఇక ప్రపంచ వ్యాప్తంగా చూస్తే యూకేలోని లండన్ అత్యంత నెమ్మదిగా వాహనాలు కదిలే నగరంగా నిలిచింది. ఇక్కడ సగటున 10 కిలోమీటర్ల దూరానికి 37 నిమిషాల 20 సెకన్ల సమయం పడుతుంది.



## అమెరికాలోని కుమార్తెకు ఫుడ్ పార్సిల్ పంపిన మహిళ

### బ్యాంక్ అకౌంట్లో రూ.కోటిన్నర మాయం!



రోజురోజుకూ సైబరాసురులు రెచ్చిపోతున్నారు. అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఎక్కువ మొత్తంలో డబ్బులు చోరీ చేస్తున్నారు. సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలంటూ అధికారులు హెచ్చరిస్తున్నా కొందరు మాత్రం వారి వలలో చిక్కుకుపోతున్నారు. తాజాగా ఓ మహిళ ఇలాంటి సైబర్? మోసగాళ్ల వలలో చిక్కుకుని రూ. కోటికి పైగా కోల్పోయింది. మహారాష్ట్రలోని ముంబయికి చెందిన ఓ 78ఏళ్ల మహిళ అమెరికాలో ఉంటున్న తన కుమార్తె కోసం కొన్ని ఆహార పదార్థాలతో పాటు మరి కొన్ని వస్తువులు పంపాలని నిర్ణయించు కుంది. అనంతరం ఓ కొరియర్ సర్వీసును సంప్రదించింది. ఆ కొరియర్ పంపిన తరువాతి రోజు అదే కంపెనీ నుంచి మాట్లాడుతున్నామంటూ ఓ వ్యక్తి వృద్ధురాలికి ఫోన్ చేశాడు. 'మీరు పంపించిన కొరియర్‌లో ఆహారంతో పాటు ఆధార్ కార్డు, గడువు ముగిసిన పాస్‌పోర్ట్‌లు, క్రెడిట్ కార్డులు, 2000 డాలర్ల నగదు, ఇతర వస్తువులు ఉన్నాయి' అని చెప్పాడు. మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశాడు. ఆ వృద్ధురాలిని నమ్మించేందుకు మరో ఇద్దరితో కలిసి ఉన్నతాధికారుల్లా నటించారు. సైబర్ మోసగాళ్లు వృద్ధురాలికి చేసిన వీడియో కాల్స్‌లో అధిరాల యూనిఫాంలో కనిపించి మరింత భయపెట్టారు. విచారణ పేరుతో పది రోజుల పాటు వృద్ధ మహిళతో మాట్లాడారు. ఈ క్రమంలోనే ఆమె బ్యాంకు ఖాతా వివరాలు సేకరించారు. అనంతరం వారి ఖాతాల్లోకి మహిళ ఖాతాలో ఉన్న రూ.కోటిన్నరను బదిలీ చేయించుకున్నారు. అయితే ఆ మహిళ జరిగిన విషయాన్నంతా తన కుటుంబ సభ్యులకు చెప్పింది. దీంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. అనంతరం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇలాంటి సైబర్? మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ విభాగం ప్రజలకు సూచించింది. అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు వస్తే తమకు ఫిర్యాదు చేయాలని కోరింది.

# స్విస్‌లో కూడా బురఖా బ్యాన్



**న్యూఢిల్లీ :** స్విట్జర్లాండ్‌లో బహిరంగ ప్రదేశాల్లో బురఖా ధరించడంపై నిషేధం అమల్లోకి వచ్చింది. ప్రజలు తిరిగే ప్రైవేట్ భవనాల్లో కూడా బురఖా నిషేధించబడుతుంది. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారికి 1,000 స్విస్ ఫ్రాంక్‌లు (రూ. 96,947) జరిమానా విధించబడుతుంది. ఈ నిర్ణయాన్ని ముస్లిం సంస్థలు, హక్కుల కార్యకర్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 2021లో జరిగిన దేశవ్యాప్త ప్రజాభిప్రాయ సేకరణలో, 51 శాతం మంది బురఖా నిషేధానికి అనుకూలంగా ఓటు వేశారు. ఈ నిర్ణయాన్ని అక్కడి పార్లమెంట్ కూడా ఆమోదించింది. దాదాపు 8.85 మిలియన్ల జనాభా కలిగిన స్విట్జర్లాండ్‌లో, ముస్లింలు 5 శాతం ఉన్నారు. ఈ కొత్త చట్టం ప్రకారం, బహిరంగ ప్రదేశాల్లో ముఖాన్ని కప్పి ఉంచడం నిషేధించబడింది, ఈ నిబంధనను ఉల్లంఘిస్తే వెయ్యి స్విస్ ఫ్రాంక్‌ల (దాదాపు రూ. 96 వేలు) జరిమానా విధించబడుతుంది. స్విట్జర్లాండ్‌లో 2021 ప్రజాభిప్రాయ సేకరణలో ఆమోదించబడిన ఈ నిషేధాన్ని ముస్లిం సంస్థలు విమర్శించాయి. విశేషమేమిటంటే, 2009లో దేశంలో కొత్త మినార్ల నిర్మాణాన్ని నిషేధించిన గ్రూపునే బురఖాపై నిషేధం విధించింది. 2021లో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో స్విట్జర్లాండ్‌లో 51.21 శాతం మంది ప్రజలు ఈ నిషేధానికి మద్దతుగా ఓటు వేశారు. మితవాద స్విస్ పీపుల్స్ పార్టీ దేశంలో బురఖా నిషేధాన్ని ప్రతిపాదించింది, ఇది దేశ సాంస్కృతిక విలువలు, ప్రజా భద్రతను కాపాడుతుందని వాదించింది. దీని తరువాత, 2022 సంవత్సరంలో దేశ జాతీయ కౌన్సిల్ ఈ చట్టాన్ని ఆమోదించింది. దీని ప్రకారం, బహిరంగ ప్రదేశాలు, కార్యాలయాలు, దుకాణాలు, రెస్టారెంట్లలో మహిళలు తమ ముఖాలను పూర్తిగా కప్పి ఉంచడం నిషేధించబడింది. బురఖా నిషేధానికి సంబంధించి స్విస్ ప్రభుత్వం విమానాల్లో లేదా దౌత్య, కాన్సులర్ ప్రాంగణాల్లో బురఖా నిషేధం వర్తించదని స్పష్టం చేసింది. ఇది కాకుండా, మతపరమైన ప్రదేశాలు, ఇతర పవిత్ర ప్రదేశాలలో ఒక వ్యక్తి తన ముఖాన్ని కప్పుకోవడానికి కూడా అనుమతించబడతారు. ఆరోగ్యం, భద్రతా కారణాలు, సాంప్రదాయ ఆచారాలు లేదా వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఫేస్ కవర్లు అనుమతించబడతాయని ప్రభుత్వం తెలిపింది. కళాత్మక లేదా వినోద కారణాలతో పాటు ప్రకటనల ప్రయోజనాల కోసం వారికి ఈ ఆమోదం మంజూరు చేసింది. సెప్టెంబరు 2022లో కొంతమంది ముస్లిం మహిళలు ధరించే బురఖా వంటి ముఖ కవచాలను నిషేధించాలని స్విట్జర్లాండ్ పార్లమెంటు దిగువ సభ ఓటు వేసింది. జాతీయ కౌన్సిల్ ఈ చట్టానికి వ్యతిరేకంగా 29 ఓట్లతో పోలిస్తే 151 ఓట్లతో ఆమోదించింది. అనేక ముస్లిం సంస్థల అభ్యంతరాలు ఉన్నప్పటికీ రైట్-వింగ్ స్విస్ పీపుల్స్ పార్టీ ఈ చట్టం కోసం ముందుకు వచ్చింది. ఇలా చేయడంలో స్విట్జర్లాండ్ మొదటి దేశం కాదు, ఐరోపాలోని బెల్జియం, డెన్మార్క్, ఫ్రాన్స్ వంటి దేశాలు కూడా ఇలాంటి ఆంక్షలు విధించాయి. అయితే, ఈ యూరోపియన్ దేశాలలో మత స్వేచ్ఛకు సంబంధించి చాలాసార్లు ప్రశ్నలు తలెత్తాయి. ప్రజా భద్రత పేరుతో చేసిన ఈ చట్టాల ద్వారా ముస్లిం మహిళలపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు.

## బెంగాల్‌లో చొరబాట్లకు కేంద్రం పాత్ర



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ రాష్ట్రంలోకి చొరబాట్లకు కేంద్ర ప్రభుత్వం ముఖ్య పాత్ర పోషిస్తున్నదని విమర్శించారు. అందుకే బంగ్లాదేశీయుల చొరబాట్లను బీఎస్ఎఫ్ అనుమతిస్తున్నదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానిది 'నీచమైన బ్లూప్రింట్' అని మండిపడ్డారు. బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు బెంగాల్‌లో శాంతికి విఘాతం కలిగిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల ఆరోపించారు. అలాగే ఓటు బ్యాంకు కోసం బంగ్లాదేశీయులకు సంబంధిత పత్రాలను టీఎంసీ అందజేస్తున్నదని, వారి చొరబాట్లకు సహకరిస్తున్నదని బీజేపీ విమర్శించింది. కాగా, గురువారం అధికారులతో సమావేశం సందర్భంగా సీఎం మమతా బెనర్జీ ఈ ఆరోపణలపై స్పందించారు. రాష్ట్రాన్ని అస్థిరపరిచేందుకు బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లను కేంద్ర బలగాలు అనుమతిస్తున్నాయని ఆరోపించారు. కేంద్రం 'నీచమైన బ్లూప్రింట్' అమలు చేస్తున్నదని విమర్శించారు. 'వివిధ ప్రాంతాల నుంచి బెంగాల్‌లోకి చొరబాట్లను బీఎస్ఎఫ్ అనుమతిస్తోంది. మహిళలను చిత్రహింసలకు గురిచేస్తోంది. సరిహద్దులను టీఎంసీ కాపాడటం లేదు. సరిహద్దు మా చేతుల్లో లేదు. కాబట్టి చొరబాట్లను టీఎంసీ అనుమతించిందని ఎవరైనా ఆరోపిస్తే, అది బీఎస్ఎఫ్ బాధ్యత అని నేను ఎత్తి చూపుతా' అని అన్నారు. మరోవైపు సరిహద్దులో చొరబాట్ల గురించి రాష్ట్ర పోలీసులతో పాటు కేంద్రం వద్ద కూడా సమాచారం ఉందని మమతా బెనర్జీ తెలిపారు. డీజీపీ రాజీవ్ కుమార్‌తోపాటు స్థానిక వర్గాల నుంచి తనకు సమాచారం అందిందని చెప్పారు. దీని గురించి కేంద్రానికి ఘాటుగా లేఖ రాస్తానని అన్నారు. అలాగే చొరబాట్లను బీఎస్ఎఫ్ అనుమతించే ప్రాంతాలను గుర్తించి దర్యాప్తు చేయాలని డీజీపీని ఆదేశిస్తానని స్పష్టం చేశారు. కాగా, పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌లో శాంతి నెలకొనాలని ఆశిస్తున్నట్లు మమతా బెనర్జీ తెలిపారు. 'మాకు శత్రుత్వం లేదు. కానీ గూండాలను ఇక్కడకు అనుమతిస్తున్నారు. వారు నేరాలకు పాల్పడి సరిహద్దు దాటి తిరిగి వస్తున్నారు. ఈ చొరబాట్లను బీఎస్ఎఫ్ అనుమతిస్తోంది. ఇందులో కేంద్రం పాత్ర కూడా ఉంది' అని అన్నారు. బెంగాల్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు ఆజ్యం పోసే ప్రయత్నం ఎవరైనా చేస్తే నిరసనలు తప్పవంటూ కేంద్రాన్ని హెచ్చరించారు.

## ఈ నెల 8న విశాఖకు రానున్న మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 8న ఆంధ్రప్రదేశ్ లో పర్యటించనున్నారు. ఈ టూర్ కు సంబంధించి ప్రధాని కార్యాలయం ఏపీ అధికారులకు సమాచారం అందించింది. ఈ నెల 8న ప్రధాని మోదీ విశాఖపట్నంలో ల్యాండ్ అవుతారని, అక్కడి నుంచి నేరుగా ఆంధ్రా యూనివర్సిటీ చేరుకుంటారని తెలుస్తోంది. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రధానికి స్వాగతం పలుకుతారని అధికారులు తెలిపారు. ఎయిర్ పోర్ట్ నుంచి ప్రధానితో పాటు వారు కూడా ఏయూ చేరుకుంటారని వివరించారు. అక్కడి నుంచే ప్రధాని మోదీ ఏపీలోని పలు ప్రాజెక్టులకు వర్చువల్ గా శంకుస్థాపన చేస్తారని సమాచారం. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్న గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు, రైల్వేజోన్ పరిపాలన భవనాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు మోదీ వర్చువల్ గా శంకుస్థాపన చేస్తారు. అనంతరం జరిగే బహిరంగ సభలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ లతో కలిసి మోదీ పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు కూడా పాల్గొంటారు. ఈమేరకు విశాఖ అధికారులకు పీఎంవో నుంచి సమాచారం అందిందని, అవసరమైన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారని సమాచారం.

## మహా కుంభమేళాలో భక్తులే లక్ష్యంగా బెదిరింపులు..



జనవరి 13 నుంచి ప్రారంభమయ్యే మహా కుంభమేళాకు ఉత్తరప్రదేశ్‌లోని గంగ, యమున, సరస్వతి (అంతర్వాహిని) నదుల సంగమ ప్రదేశం ప్రయాగ్‌రాజ్ ముస్తాబవుతోంది. మహా కుంభమేళాకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. అయితే, ఈ కుంభమేళాకు బాంబు బెదిరింపులు రావడం ప్రస్తుతం కలకలం రేపుతోంది. ఓ ఎక్స్ యూజర్ ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. మతపరమైన ఈ కార్యక్రమానికి హాజరయ్యే కనీసం 1,000 మందిని లక్ష్యంగా చేసుకొని బెదిరింపులకు పాల్పడ్డాడు. వెంటనే అప్రమత్తమైన యూపీ పోలీసులు సదరు ఎక్స్ యూజర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టారు. కాగా, మహా కుంభమేళాకు ప్రయాగ్‌రాజ్ సిద్ధమవుతోంది. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకూ 45 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కుంభమేళాలో 45 కోట్లమంది భక్తులు పాల్గొని గంగాస్నానం ఆచరించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో యూపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో పాల్గొనే భక్తుల సౌకర్యం కోసం 1,60,000 టెంట్లు, 1,50,000 మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నారు. 15,000 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తారు. 1,250 కిలోమీటర్ల పైప్‌లైనును సిద్ధం చేస్తున్నారు. 67 వేల ఎల్ఈడీ లైట్లు, 2 వేల సోలార్ లైట్లు, 3 లక్షల మొక్కలు ఏర్పాటవుతున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత కెమెరాలు, ఆర్ఎఫ్ఐడీ రిస్ట్‌బ్యాండ్స్, యాప్ ట్రాకింగ్‌లతో భక్తులను లెక్కిస్తారు.

## శరద్ పవార్, తన కుమారుడు కలవాలని దేవుడ్ని ప్రార్థించా: అజిత్ పవార్ తల్లి



**ముంబై:** మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ తల్లి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్, తన కుమారుడు మళ్లీ కలవాలని దేవుడ్ని ప్రార్థించినట్లు తెలిపారు. తన ప్రార్థనలు ఫలిస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. కొత్త ఏడాది తొలి రోజైన బుధవారం అజిత్ పవార్ తల్లి ఆశా-తాయ్ పవార్, పంఢర్‌పూర్‌లోని ప్రసిద్ధ విఠల్, రుక్మిణీ ఆలయాన్ని సందర్శించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. తన కుమారుడు, విడిపోయిన శరద్ పవార్ మధ్య మళ్లీ సయోధ్య కుదరాలని విఠల్ స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. 'పవార్ కుటుంబంలో ఉన్న మనస్తాపాలన్నీ తొలగిపోవాలని నేను ప్రార్థించా. అజిత్, శరద్ పవార్ మళ్లీ కలవాలని నేను ప్రార్థించా. నా ప్రార్థనలు ఫలిస్తాయని ఆశిస్తున్నా' అని అన్నారు. కాగా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన తర్వాత అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ, ప్రత్యర్థి శరద్ పవార్ వర్గాన్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శరద్ పవార్‌తో తన కుమారుడు మళ్లీ కలవాలని అజిత్ పవార్ తల్లి ఆశా-తాయ్ పవార్ బహిరంగంగా ప్రస్తావించడం ప్రాధాన్యత సంతరించుకున్నది. ఎన్సీపీలో కీలక నేత ప్రఫుల్ పటేల్ కూడా దీనిపై స్పందించారు. 'శరద్ పవార్ మాకు దేవుడు లాంటివారు. పవార్ కుటుంబం ఏకమైతే నేను చాలా సంతోషిస్తా' అని మీడియాతో అన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక





# నాన్న అలా అంటాడనుకోలేదు

: కీర్తిసురేష్

హీరోయిన్ కీర్తి సురేశ్ ఇటీవల తన చిరకాల మిత్రుడు ఆంటోనిని పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. హిందూ, క్రిస్టియన్ సంప్రదాయాల్లో వీరిద్దరి పెళ్లి జరిగింది. 15 ఏళ్ల ప్రేమకథను రోజుకో ఎపిసోడ్‌లాగా కీర్తి పంచుకుంటున్నారు. బేబీజాన్ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పెళ్లి విశేషాలను పంచుకున్నారు. ముఖ్యంగా క్రిస్టియన్ పద్ధతి గురించి మాట్లాడుతూ.. ఆంటోనీ కుటుంబ ఆచారాలకు అనుగుణంగా ఆ సంప్రదాయం లో పెళ్లి చేసుకున్నామన్నారు. "క్రిస్టియన్ సంప్రదాయంలోనూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాక మా నాన్నతో మాట్లాడాను. 'నాన్నా.. ఈ సంప్రదాయం ప్రకారం వధువును ఆమె తండ్రి పెళ్లి వేదిక పైకి తీసుకురావాలి. నా కోసం మీరు కూడా ఆ విధంగా చేస్తారా?' అని అడిగా. 'తప్పకుండా చేస్తాను. మనం రెండు సంప్రదాయాల్లో వివాహం జరుపుతున్నాం. కాబట్టి నేను కూడా ఆ పద్ధతులు పాటిస్తాను' అని ఆయన బదులిచ్చారు. ఆ మాట నాకెంతో సంతోషాన్ని ఇచ్చింది. నేను చెప్పిన దానికి ఆయన అంగీకరిస్తారని అసలు ఊహించలేదు. కానీ ఆయన నా కోసం ఆ విధంగా చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది" అని కీర్తి సురేశ్ తెలిపారు. ఇటీవల బేబీజాన్ ఈవెంట్‌కు వెళ్లిన ఆమె పసుపుతాడు (మంగళసూత్రం)తో హాజరు కావడంపై ఆమె స్పందించారు. "దక్షిణాదిలో ఒక సంప్రదాయం ఉంది. పెళ్లి సమయంలో వధువు మెడలో వరుడు పసుపుతాడు కడతాడు. దానిని మేమెంతో పవిత్రంగా భావిస్తాం. పెళ్లైన కొన్ని రోజులకు ఒక మంచి ముహూర్తం చూసి మంగళ సూత్రాలను బంగారు చైన్‌లోకి మార్చుకుంటాం. జనవరి చివరివరకూ మంచి రోజులు లేవు. అప్పటివరకూ నేను ఎక్కడికి వెళ్లినా పసుపు తాడు తో కనిపిస్తాను" అని తెలిపారు. ఆంటోనీ, కీర్తి 15 ఏళ్లగా ప్రేమలో ఉన్నారు. కీర్తి కంటే అతను ఏడేళ్ల పెద్దవాడు. అందరిలాగే రిలేషన్‌లో ఉన్నప్పుడు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నామని కీర్తి చెప్పారు. కొవిడ్ సమయంలో కలిసి ఉన్నామని, 2022లో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నామని కీర్తి అన్నారు. పెద్దల అంగీకారంతో ఈ జంట డిసెంబర్‌లో వివాహబంధంలోకి అడుగుపెట్టింది. కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో గోవాలో పెళ్లి జరిగింది.



# 12 ఏళ్లకు థియేటర్లలోకి విశాల్ సినిమా

తెలుగు, తమిళ ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ విశాల్. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న విశాల్‌కు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి బయటకు వచ్చింది. విశాల్ నటించిన చిత్రాల్లో ఒకటి మదగజరాజ. యాక్షన్ కామెడీ బ్యాక్ డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రాన్ని సుందర్ సీ డైరెక్ట్ చేశాడు. అంజలి, వరలక్ష్మి శరత్‌కుమార్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటించగా.. సంతానం, సోనూసూద్ కీలక పాత్రల్లో నటించారు. 2013 పొంగళ్ కానుకగా జనవరిలోనే విడుదల కావాల్సిన ఈ సినిమా పలు కారణాలతో వాయిదా పడ్డది. 12 ఏండ్ల లాంగ్ గ్యాప్ తర్వాత థియేటర్లలో సందడి చేసేందుకు రెడీ అయింది. జెమినీ ఫిల్మ్ సర్క్యూట్ తెరకెక్కించిన ఈ చిత్రం జనవరి 12న గ్రాండ్‌గా విడుదల కానుంది. అజిత్‌కుమార్ నటించిన విదాముయార్చి సంక్రాంతి బరిలో నుంచి తప్పుకోవడంతో విశాల్ టీం ఈ నిర్ణయం తీసుకుందట. ఈ చిత్రానికి విజయ్ ఆంటోనీ సంగీతం అందించాడు. మరి దశాబ్ధం తర్వాత థియేటర్లలోకి వస్తున్న ఈ సినిమాకు ఎలాంటి స్పందన వస్తుందనేది చూడాలి.

# కోటి రూపాయలు ఇస్తాను.. కానీ పుస్తకాలు ఇవ్వను

: పవన్‌కళ్యాణ్




విజయవాడలోని ఇందిరాగాంధీ మైదానంలో 35వ బుక్ ఫెస్టివల్ ప్రారంభమయిన విషయం తెలిసిందే. ఈ బుక్ ఫెస్టివల్‌ను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జనవరి 2న సాయంత్రం లాంఛనంగా ప్రారంభించారు. 234 స్టాళ్లతో అనేకమంది ప్రచురణకర్తలు ఈ మహోత్సవంలో పాల్గొననున్నారు. సాహితీ నవజీవన్ బుక్ లింక్స్ అధినేత పిడికిలి రామకోటేశ్వరరావు పేరును ఈ బుక్ ఫెస్టివల్ ప్రాంగణానికి పెట్టారు. ప్రధాన సాహితీవేదికకు ఈనాడు అధినేత దివంగత రామోజీరావు పేరు పెట్టారు. విద్యార్థుల కార్యక్రమాలు జరిగే ప్రతిభా వేదికకు దివంగత పారిశ్రామిక వేత్త రతన్ టాటాపేరు పెట్టారు. ఈ పుస్తక మహోత్సవం 2వ తేదీనుంచి 12వ తేదీ వరకు జరుగనున్నాయి. అయితే ఈ బుక్ ఫెస్టివల్‌లో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. కోటి రూపాయలు అయిన ఇవ్వడానికి వెనుకాడను కానీ నా దగ్గర పుస్తకాలు ఉన్న ఇవ్వడానికి ఆలోచిస్తాను. పుస్తకాన్ని ఇవ్వాలి అంటే నా సంపదను ఇచ్చినట్లే అని నాకు అనిపిస్తుంది. కర్ణుడు కవచ కుండలాలను కోసేస్తే ఎలా బాధ పడుతాడో తెలీదు కానీ.. నా పుస్తకం ఇవ్వాలంటే కింద, మీద పడిపోతాను అంత మమకారం పుస్తకాలు అంటే అని పవన్ చెప్పుకోచ్చాడు. పుస్తక పఠనం లేకపోతే నేను ఎలా ఉండేవాడినో అనిపిస్తది. నేను ఇంటర్ కూడా ఎందుకు ఆపేశాను అంటే నేను కోరుకుంటున్న చదువు పుస్తకాల్లో, క్లాస్ రూంలో లేదు అందుకే ఇంటర్ ఆపేశాను. రవీంద్రనాథ్ ఠాగూర్ స్కూలుకి వెళ్లకుండా ఇంట్లోనే కూర్చొని చదువుకున్నాడు.. నేను ఠాగూర్ గారి ప్రేరణతో ఆయన లాగే చెట్లు, మొక్కలు చూస్తూ పుస్తకాలు పెట్టుకొని ఉండిపోయాను అంటూ పవన్ కళ్యాణ్ చెప్పుకోచ్చాడు.

# ఫుల్ స్టంటింగ్‌తో వస్తున్న బెల్లంకొండ శ్రీనివాస్



టాలీవుడ్ యాక్టర్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఈ యంగ్ యాక్టర్ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి12. మిస్టిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి లుధీర్ బైరెడ్డి దర్శకత్వం వహిస్తున్నాడు. మహేశ్ చందు తెరకెక్కిస్తున్నారు. కాగా నేడు బెల్లంకొండ బర్త్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ కొత్త పోస్టర్ ఒకటి షేర్ చేశారు. కొండపైన అటవీ ప్రాంతంలో గాలులు, మంటల మధ్య రైడ్ చేయడానికి సిద్ధంగా ఉన్న లుక్ ఇప్పుడు నెట్టింటిని షేక్ చేస్తోంది. త్వరలోనే బిగ్ స్క్రీన్‌పై హై ఆక్టేన్ ఎక్స్‌పీరియన్స్‌ను ఫీల్ అయ్యేందుకు రెడీగా ఉండండి.. అంటూ రిలీజ్ చేసిన పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ లుక్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తోంది. ఈ మూవీలో భీమ్లానాయక్ ఫేం సంయుక్తా మీనన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.



# విలనిజం చూపించేందుకు సిద్ధమైన ఉదయభాను

బుల్లితెర యాంకర్లు ఎంతో మంది వెండితెరపై తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఈ జాబితాలో సుమ, ఝూన్సీ, రష్మీ, శిల్పా చక్రవర్తి, అనసూయ ఇలా ఎంతో మంది ఉన్నారు. వీరిలో ఉదయభాను కూడా ఒకరు. తొలి నుంచీ కూడా ఉదయభాను టాలీవుడ్ పై ఫోకస్ చేస్తూనే ఉంది. సరైన పాత్రలు మాత్రం ఆమెకు రాలేదు. దీంతో, ఆమె ఐటెం సాంగ్స్ కూడా చేసింది. తాజాగా మరో యాంగిల్ ను చూపించేందుకు ఉదయభాను రెడీ అవుతోంది. విలన్ గా సత్తా చాటేందుకు భాను సిద్ధమయింది. సత్యరాజ్ ప్రధాన పాత్ర పోషిస్తున్న 'బార్బరిక్' సినిమాలో ఉదయభాను విలనిజం చూపించబోతోందట. ఈ చిత్రానికి శ్రీవత్స దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుందట.



# మగాళ్లు శృంగారం చేయకండి

: చిన్మయి శ్రీపాద

చిన్మయి శ్రీపాద.. ఈ పేరు అంటేనే కొంతమందికి హడల్, మరికొందరికి కోపం, చిరాకు ఇంకొందరికి ప్రేమ, అభిమానం. ఈ అభిప్రాయాలన్ని కేవలం ఆమె కళ సృజనాత్మకత గురించి మాత్రమే కాదు. ఆమె తనకంటూ ఒక అభిప్రాయం, స్టాండ్, పర్సనాలీటీని క్రియేట్ చేసుకున్నాక చాలా మందికి కంటి మీద నిద్ర లేకుండా చేస్తోంది. బహిరంగంగాను, సోషల్ మీడియా ద్వారాను ఆమె సొసైటీలో మహిళలు పేస్ చేస్తున్న సమస్యలపై పోరాటం చేస్తుంటుంది. తాజాగా ఓ నెటిజన్ చేసిన ట్వీట్ కి దిమ్మదిరిగిపోయే కౌంటర్ ఇచ్చి మరోసారి వార్తల్లో నిలిచింది. ఇంతకీ ఏం జరిగిందంటే.. 2024 సంవత్సరం పూర్తికావడంతో చాలా సంస్థలు వాళ్ళ సేల్స్, అచీవ్ మెంట్స్ తదితర అంశాలని షేర్ చేశాయి. ఈ నేపథ్యంలోనే.. ప్రముఖ హోమ్ డెలివరీ గ్రోసరీస్ సంస్థ బ్లింక్ ఇట్ సీఈఓ ఒక్క రోజులోనే తమ యాప్ ద్వారా లక్షకు పైగా కండోమ్స్ సేల్ చేసినట్లు ట్వీట్ చేశారు. ఈ క్రమంలోనే ఓ నెటిజెన్.. ఇలా అయితే వర్జిన్ అమ్మాయిలు భార్యలుగా దొరకడం కష్టమే.. అంటూ ట్వీట్ చేశాడు. దీనికి చిన్మయి స్పందిస్తూ.. "మగాళ్లు పెళ్ళికి ముందు అమ్మాయిలతో శృంగారం చేయడం ఆపండి. మీ అన్నదమ్ముల్ని, ఫ్రెండ్స్ ని పెళ్లి అయ్యేదాకా అలాంటి పని చేయొద్దని చెప్పండి" అంటూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. దీంతో ఈ వార్త తెగ వైరల్ అవుతోంది. మీటూ మూవ్‌మెంట్‌లో భాగంగా ప్రముఖ తమిళ గేయ రచయిత వైరముత్తు, పలువురు ఇండస్ట్రీకి చెందిన ప్రముఖులపై ఆమె సంచలన కామెంట్స్ చేశారు. ఎందరో మహిళలలకు ఆమె అండగా నిలుస్తూ పోరాటం చేస్తున్నారు.